
ఆంధ్రజ్యోతి
ఉష్ణోగ్రతలు గరిష్ఠం : 37.0 । కనిష్ఠం : 24.0
ANDHRAJYOTHY 5
నాగర్‌కర్నూల్ జిల్లా వార్తలు
గురువారం 27 మార్చి 2025



రంజాన్ వేళలు
ఇఫ్తార్: 6:35 (గురువారం సాయంత్రం)
సహర్: 4:51 (శుక్రవారం ఉదయం)

సాధారణ ప్రసవాల సంఖ్య పెంచాలి

» వనపర్తి జిల్లా వైద్య,ఆరోగ్యశాఖ అధికారి శ్రీనివాసులు 6



వైద్య పరీక్షల కోసం ఎంసీహెచ్‌లో వేచి ఉన్న గర్భిణులు

గర్భిణులపై స్కానింగ్ భారం

- ప్రభుత్వ ఆసుపత్రిలో మూతపడ్డ స్కానింగ్ కేంద్రం
- సెప్టెంబరు నుంచి తప్పని తిప్పలు
- ప్రైవేటు స్కానింగ్‌కు రూ. 5 వేలు
- ప్రతీ రోజు ఆస్పత్రికి వస్తున్న 200 నుంచి 250 మంది గర్భిణులు

గర్భిణులు బిడ్డకు జన్మనివ్వాలంటే ఎన్నో ఇబ్బందులు పడాల్సి ఉంటుంది. కొన్ని సందర్భాల్లో ప్రసవం సమయంలో వారు మరో జన్మ ఎత్తినంత బాధ భరిస్తుంటారు. తన ప్రాణం పణంగా పెట్టి బిడ్డకు జన్మనిచ్చే తల్లులు గర్భవతులుగా ఉన్న సమయంలో ఎంతో ప్రశాంతంగా.. ఒత్తిడికి గురికాకుండా ఉండాలి. కానీ నిరుపేద కుటుంబాలకు ఇది సాధ్యం కావడం లేదు. అయినా ఆర్థిక సమస్యను అధిగమిస్తే వారు ఎంతో సుఖంగా ఉన్నట్లే. కానీ, వనపర్తి ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో స్కానింగ్ కేంద్రం మూతపడటంతో ఆర్థిక భారం కూడా మోయాల్సి వస్తోంది. దీంతో ఆస్పత్రికి వచ్చే గర్భిణులు స్కానింగ్ కోసం ప్రైవేట్ ఆస్పత్రులను సంప్రదిస్తున్నారు. ఒక్కోసారి ఒక్క గర్భిణి స్కానింగ్‌కు దాదాపు రూ.5 వేల ఆర్థిక భారం మోస్తోంది. ప్రసవాలలో మూడో స్థానంలో ఉన్న వనపర్తి ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలోనే పరిస్థితి ఇలా ఉంటే మిగతా ఆస్పత్రుల పరిస్థితి ఏ విధంగా ఉన్నదో ఊహించుకుంటేనే భయమేస్తోందని నిరుపేద గర్భిణులు వాపోతున్నారు.

6

\- వనపర్తి వైద్యవిభాగం, ఆంధ్రజ్యోతి



వనపర్తిలోని మాతా శిశు సంరక్షణ కేంద్రం

పెద్ద పులి ‘పద్దు’

- నల్లమలలో మొదలైన పులుల గణన
- కొల్లాపూర్ రేంజ్ పరిధిలో 100 సీసీ కెమెరాలతో నిఘా
- గత ఏడాది తొమ్మిది పెద్ద పులుల గుర్తింపు
- ఈ ఏడాది వాటి సంఖ్య పెరిగే అవకాశం
- చిరుతలు, వన్యప్రాణుల సంఖ్య కూడా లెక్కింపు



నల్లమల అటవీ ప్రాంతంలో పెద్దపులుల గణన ప్రారంభమైంది. కొల్లాపూర్ రేంజ్ పరిధిలో అటవీశాఖ అధికారులు 100 సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. సీసీ ఫుటేజీలో నమోదైన చిత్రాల ఆధారంగా పెద్ద పులులు, చిరుతలు, వన్య ప్రాణుల సంఖ్యను తేల్చనున్నారు.

\- కొల్లాపూర్, ఆంధ్రజ్యోతి 7

అనుమతిస్తే.. అవాంతరాలు

తొలగినట్లే


- ఎస్‌ఎల్‌బీసీ పూర్తి చేయడం డీబీఎంతోనే సాధ్యమని తేటతెల్లం
- ప్రభుత్వ ప్రత్యామ్నాయ ప్రణాళికను ముందే చెప్పిన ఆంధ్రజ్యోతి
- అప్పట్లో బ్లాస్టింగ్‌కు అనుమతి లేకపోవడంతోనే టీబీఎంతో తవ్వకం
- టన్నెల్ మొత్తం అమ్రాబాద్ టైగర్ రిజర్వ్‌లో ఉండటంతోనే సమస్య
- పాత అనుమతులను సమీక్షించి కొత్తగా తీసుకోవడం తేలికేమీ కాదు
- టిప్పర్లు, యంత్రాలు తిరగడానికి షాఫ్ట్ తవ్వకం ప్రధానంగా అవసరం



టన్నెల్ లోపలి భాగం

మహబూబ్‌నగర్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : శ్రీశైలం ఎడమగట్టు కాలువ సొరంగంలో ప్రమాదం జరిగి 30 రోజులు పూర్తయ్యింది. ఇప్పటివరకు ఇద్దరు కార్మికుల మృతదేహాలు మాత్రమే లభ్యమయ్యాయి. చిక్కుకున్న మొత్తం కార్మికుల ఆచూకీ లభ్యం అయ్యే వరకు సహాయక చర్యలు కొనసాగుతాయని సోమవారం జరిగిన సమీక్ష సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. అయితే టన్నెల్ పూర్తి చేయడాన్ని కూడా సవాల్‌గా తీసుకున్న ప్రభుత్వం ప్రత్యామ్నాయ ప్రణాళికపై కూడా దృష్టి సారించింది. సోమవారం సీఎంతో జరిగిన సమీక్ష సందర్భంగా టన్నెల్‌ను పూర్తిచేయాలంటే డ్రిల్లింగ్ అండ్ బ్లాస్టింగ్ పద్ధతిని అనుసరించాలని నిర్ణయించారు. ఈ మేరకు అవసరమయ్యే అనుమతులు కూడా తీసుకోవాలని అధికారులను సీఎం ఆదేశించారు.

ప్రమాదం జరిగిన తర్వాత టన్నెల్ భవిష్యత్‌పై నీలినీడలు కమ్ముకున్న తరుణంలో ‘ఆంధ్రజ్యోతి’ ముందుగానే డీబీఎం పద్ధతిలో నిర్మాణం చేపట్టనున్నట్లు వివరాలు వెల్లడించింది. భవిష్యత్‌లో అదే నిజం కాబోతోంది. ఇప్పటికే తవ్వకం ప్రారంభించి 18 ఏళ్లు పూర్తికాగా త్వరితగతిన పూర్తిచేయడానికి డీబీఎం పద్ధతి మేలనే అభిప్రాయాన్ని నిపుణులు కూడా వ్యక్తం చేస్తున్నారు. అయితే అటవీశాఖ నుంచి అనుమతులు తీసుకురావడం అంత తేలికేమీ కాదని కూడా అంటున్నారు. ఇప్పటికే రాష్ట్రంలో చాలా ప్రాజెక్టులు అటవీ అనుమతులు రాకనో, పర్యావరణ ప్రేమికులు కేసులు వేయడం ద్వారానో ముందుకు సాగడం లేదు. దీని విషయంలో కూడా అది జరగకుండా ప్రభుత్వం వేగంగా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. అటవీ అనుమతులు తొలగినట్లయితే చాలా వేగంగా మిగిలిన దూరాన్ని డీబీఎం ద్వారా పూర్తిచేసే అవకాశం ఉంది.



టన్నెల్ వద్ద ఏర్పాటు చేసిన కన్వేయర్ బెల్టు

టైగర్ రిజర్వ్‌తోనే సమస్య..

ఎస్‌ఎల్‌బీసీ టన్నెల్‌లో ఇన్‌లెట్ (దోమలపెంట), ఔట్ లెట్ (మన్నెవారిపల్లి) మధ్య మొత్తం 43 కిలోమీటర్ల దూరం ఈ ప్రాంతం మొత్తం అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ పరిధిలో ఉన్నది. ఇన్‌లెట్ వైపు నుంచి 13.936 కిలోమీటర్లు, ఔట్ లెట్‌వైపు 8 నుంచి 20.436 కిలోమీటర్ల టన్నెల్ పూర్తయ్యింది. మరో 9.56 కిలోమీటర్లు తవ్వాల్సి ఉండగా ఇన్‌లెట్ వైపు నుంచి పనులు జరుగుతుండగా ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో టీబీఎం మొత్తం ధ్వంసమై పనిచేసే అవకాశం వందశాతం లేనట్లే. దాన్ని ముక్కలుగా చేసి మరీ సహాయక చర్యలు చేపడుతున్నారు. కొత్త టీబీఎం లోపలికి పంపించే అవకాశం కూడా లేదు. టీ బీఎం డయా 10 మీటర్లు కాగా సెగ్మెంట్ బ్లాకులు పెట్టిన తర్వాత 9.25 మీటర్ల డయా అవుతుంది. అలాగే పంప్ స్టేషన్లు, కన్వేయర్ బెల్టులు, లోకో ట్రాక్‌లు కూడా ఉంటాయి. కాబట్టి

(మిగతా 6లో..)

ప్రత్యామ్నాయం ఫైనల్ అయినట్లేనా?

సీఎంతో సమావేశంలో డ్రిల్లింగ్ అండ్ బ్లాస్టింగ్ పద్ధతిపై సూత్రప్రాయంగా నిర్ణయం కుదిరినట్లు తెలుస్తోంది. అయితే గతంలో జేపీ అసోసియేట్స్ ప్రతిపాదించిన ప్రణాళికనే ఫైనల్ చేస్తారా, లేక మరో ప్రణాళిక ఏదైనా సిద్ధం చేస్తారా అనే విషయంలో స్పష్టత రాలేదు. ప్రాథమిక ప్రణాళిక ప్రకారం ప్రస్తుత ప్రమాదం 13.900 కిలోమీటర్ల వద్ద జరగ్గా 13.500 కిలోమీటరు వరకు బాగానే ఉన్నది. అక్కడి నుంచి 50 మీటర్ల నుంచి 200 మీటర్ల వరకు (జీఎస్‌ఐ సూచనల ప్రకారం) కుడివైపునకు తిరిగి పాత లెవల్‌ను కొనసాగిస్తూ 20వ కిలోమీటర్ వద్ద పాత అలైన్‌మెంట్‌కు టన్నెల్‌ను కలుపనున్నారు. ఇప్పటికే ఔట్‌లెట్ టన్నెల్‌వైపు 20.435 కిలోమీటర్ల మేర తవ్వకం పూర్తయ్యింది. పాత డిజైన్ ప్రకారం ఇంకో 3.545 కిలోమీటర్లు తవ్వాలి. కానీ, టీబీఎం చెడిపోవడంతో పనులు అటువైపు కూడా ఆగిపోయాయి. బేరింగ్ రావడానికి చాలా సమయం పడుతుంది. దీంతో ఔట్‌లెట్ టన్నెల్ తవ్వకం అక్కడికే నిలిపివేసి ఇన్‌లెట్ నుంచి పక్కకు జరిగి 13.500 కిలోమీటర్ల నుంచి 20వ కిలోమీటర్ వరకు డీబీఎం పద్ధతిలో టన్నెల్‌ను తవ్వుతారు. దీనివల్ల సమయం తక్కువగానే పట్టి త్వరితగతిన ప్రాజెక్టును పూర్తిచేసే అవకాశం ఏర్పడుతుందని అంచనా వేస్తున్నారు. అయితే ప్రాజెక్టు పూర్తికి దీనికి మించిన ప్రత్యామ్నాయ మార్గం కూడా లేదని పలువురు నిపుణులు పేర్కొంటున్నారు. కానీ, జీఎస్‌ఐ సూచనల ప్రకారమే చర్యలు తీసుకోనున్నారు. ప్రస్తుతం టన్నెల్ డయా 9.25 మీటర్లు సర్క్యులర్ షేప్‌లో ఉండగా అది 10 మీటర్లకు షూ షేప్ సైజ్‌గా మార్చనున్నారు. అయితే ఈ పద్ధతిలో పనులు చేయాలంటే కచ్చితంగా అటవీ అనుమతులను త్వరితగతిన సాధించాల్సి ఉంది.

మళ్లీ బెట్టింగ్‌లు

- హోటళ్లు, బార్లు బెట్టింగ్‌లకు అడ్డాలు
- కీలకపాత్ర పోషిస్తున్న కొందరు ఉద్యోగులు

గద్వాల క్రైం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): జోగుళాంబ గద్వాల జిల్లాలో క్రికెట్ బెట్టింగ్‌లు.. ఆన్‌లైన్ గేమింగ్‌లు మళ్లీ కొనసాగుతున్నాయి. జిల్లాలో కొందరు ఇదేపనిగా బెట్టింగ్‌లపై ప్రతీయేటా లక్షలు సంపాదిస్తున్నారు. ఐపీఎల్ ప్రారంభం కావడంతో మళ్లీ బెట్టింగ్‌లు నడుస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. జిల్లాలో యువకులతో పాటు ప్రభుత్వ ఉద్యోగులు, వ్యాపారులు కూడా బెట్టింగ్‌లకు బానిసై దళారుల ఉచ్చులో పడుతున్నారు. కొందరు ఉపాధ్యాయులు కూడా వీటి బుకీలుగా ఉన్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. వీరు ఇతర ఉపాధ్యాయులను ఉచ్చులోకి దింపుకొని వారిని ఆన్‌లైన్ బెట్టింగ్‌లలో పాల్గొనేలా చేస్తున్నట్లు తెలుస్తుంది.

నాలుగు రోజుల నుంచి..

ప్రస్తుతం ప్రారంభమైన ఐపీఎల్ మ్యాచ్‌ల సందర్భంగా బంతిబంతికి ఒకరేటును బుకీలు నిర్ణయిస్తున్నారు. అంతేకాకుండా ఆటలో పాల్గొనే వారికంటే బుకీలుగా ఉన్నవారికి 10శాతం కమీషన్ రావడంతో ఈ బుకీలు ఎక్కువగా బెట్టింగ్‌లు వేసేవారిపై దృష్టి సారిస్తున్నారు. బెట్టింగ్‌లో గెలిచిన వారికి ఒక టికి పదిరెట్లు చెల్లిస్తూ యువతను ఆకట్టుకుంటున్నారు. యువకులు తమ దగ్గర డబ్బు లేకున్నా తమ బైక్‌లను, బంగారు ఆభరణాలను తాకట్టు పెట్టి బెట్టింగ్ ఆడుతున్నట్లు తెలుస్తోంది. ఇక మరి కొందరు వడ్డీకి తెచ్చి బెట్టింగ్‌లో పాల్గొంటున్నారు. కొందరు యువకులు తమ ఇంట్లోనే దొంగలుగా మారి వస్తువులను ఎత్తుకెళ్లి బెట్టింగ్‌లకు ధారపోస్తున్నారు.

బెట్టింగ్‌లలో ప్రభుత్వ ఉద్యోగుల

ఐపీఎల్ మ్యాచ్‌లలో పందెం కాస్తూ రాత్రికి రాత్రి లక్షాధికారులు, కోటీశ్వరులు కావాలని కొందరు బుకీలు ఉపాధ్యాయులను పావులుగా వాడుకుంటున్నారు. ఇటీవలే ఆన్‌లైన్ బెట్టింగ్‌లు, ఆన్‌లైన్ గేమింగ్‌లకు అలవాటు పడ్డ ఉపాధ్యాయులు గతంలో బెట్టింగ్‌లలో ఓడిపోయి ఒకరు రూ. 3 కోట్లు నష్టపోయి గద్వాల విడిచి పారిపోగా... మరో ఉపాధ్యాయుడు రూ. 70 లక్షల అప్పుతో ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఆత్మహత్య చేసుకున్న ఉపాధ్యాయుడితో పాటు మరో నలుగురు ఉపాధ్యాయులు ఆన్‌లైన్ బెట్టింగ్‌లో రూ. 5కోట్ల నష్టం జరిగినట్లు తెలుస్తోంది. అలాగే జిల్లా కేంద్రంలో గతంలో ఓ విద్యార్థి బెట్టింగ్‌తో నష్టపోయి తీసుకున్న డబ్బులకు వడ్డీలు కట్టలేక దొంగగామారి జైలుకు వెళ్లిన సంఘటనలు ఉన్నాయి. ఇలా అయిజ, గద్వాలలో జోరుగా బెట్టింగ్‌లు నడుస్తున్నట్లు సమాచారం.

ప్రత్యేక నిఘా ఉంచాం



ఆన్‌లైన్ బెట్టింగ్‌లు, గేమింగ్‌ల వల్ల ఎంతోమంది జీవితాలు నాశనం అవుతున్నాయి. గద్వాల జిల్లాలో బెట్టింగ్‌లు నిర్వహించే వారిపై ప్రత్యేక నిఘా ఉంచాం. బెట్టింగ్‌లను ప్రోత్సహించినా.. నిర్వహించినా చర్యలు తీసుకుంటాం.

\- శ్రీనివాసరావు, ఎస్పీ, గద్వాల

‘పీఎం శ్రీ’ కి 30 పాఠశాలలు

- మూడో విడత ఎంపికకు ప్రతిపాదన
- మొదటి విడతలో 10, రెండో విడతలో 11 బడుల ఎంపిక

7



రాజ్యాంగ పరిరక్షణకు కృషి చేస్తామని కార్యకర్తలతో ప్రతిజ్ఞ చేయిస్తున్న రాష్ట్ర సాంస్కృతిక శాఖ చైర్మన్ వెన్నెల, వేదికపై సంపత్‌కుమార్, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ సరిత

రాజ్యాంగాన్ని మార్చే కుట్ర

- ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్
- బీచుపల్లిలో జై బాపు.. జైభీమ్.. జై సంవిధాన్ సభ
- హాజరైన రాష్ట్ర సాంస్కృతిక శాఖ చైర్మన్ వెన్నెల, క్రిస్టియన్ మైనార్టీ చైర్మన్ దీపక్‌జాన్

ఎర్రవల్లి, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): బీజేపీ భారత రాజ్యాంగాన్ని మార్చే కుట్ర చేస్తోందని ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జై బాపు.. జైభీమ్.. జై సంవిధాన్ కార్యక్రమాన్ని బుధవారం జోగుళాంబ గద్వాల జిల్లా ఎర్రవల్లి మండలం బీచుపల్లిలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర సాంస్కృతిక చైర్మన్ వెన్నెల, క్రిస్టియన్ మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ దీపక్‌జాన్‌లతో పాటు గద్వాల జడ్పీ మాజీ చైర్‌పర్సన్ సరిత హాజరయ్యారు. ఈ సందర్భంగా సంపత్‌కుమార్ మాట్లాడుతూ గాంధీని చంపిన గాడ్సే మార్గంలో బీజేపీ పాలన కొనసాగుతోందని, దేశంలో రాజ్యాంగాన్ని మార్చే కుట్రకు తెర లేపిందన్నారు. దానిని తిప్పి కొట్టేందుకు కాంగ్రెస్ పార్టీ ఈ విధానాన్ని క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లేందుకు శ్రీకారం చుట్టిందని అన్నారు. ప్రతీ కాంగ్రెస్ కార్యకర్త బీజేపీ కుట్రలను ప్రజలకు వివరించాలన్నారు. దీపక్‌జాన్ మాట్లాడుతూ నరేంద్రమోదీకి 400 సీట్లు వస్తే రాజ్యాంగాన్ని మార్చేవారని, దేశ ప్రజలు వారికి ఆ అవకాశం ఇవ్వలేదన్నారు. వెన్నెల మాట్లాడుతూ మనువాద బీజేపీ చర్యలకు తాను రాజకీయాల్లోకి రావాల్సి వచ్చిందన్నారు. దేశంలో కొత్త కళంకం సృష్టించబోయే బీజేపీకి ప్రజలే సరైన సమాధానం ఇస్తారన్నారు. అనంతరం కాంగ్రెస్ కార్యకర్తలతో ఆమె రాజ్యాంగాన్ని పరిరక్షిస్తామని ప్రతిజ్ఞ చేయించారు. జడ్పీ మాజీ చైర్‌పర్సన్ సరిత మాట్లాడుతూ పార్టీ ప్రతిష్టాత్మకంగా చేపట్టే ఈ కార్యక్రమాన్ని గ్రామస్థాయిలోకి తీసుకెళ్తామని తెలిపారు. ముందుగా నాయకులు బీచుపల్లి అంజన్నను దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఎస్సీ సెల్ అధ్యక్షుడు మద్దిలేటి, జిల్లా గ్రంథాలయ చైర్మన్ నీలిశ్రీను, అలంపూర్ వ్యవసాయ కమిటీ చైర్మన్ దొడ్డెప్ప, నాయకులు పాల్గొన్నారు.

అధిష్టానం పట్టించుకోవాలి

బీచుపల్లిలో జరిగిన జిల్లా స్థాయి సమావేశంలో గద్వాల ఇన్‌చార్జి సరిత వర్గీయులు భగ్గుమన్నారు. గద్వాల ఎమ్మెల్యేను కాంగ్రెస్ పార్టీలోకి చేర్చుకుని పార్టీ కోసం పని చేసిన కార్యకర్తలకు ప్రాధాన్యం ఇవ్వడం లేదని మండిపడ్డారు. గద్వాల ఎమ్మెల్యే తాను కాంగ్రెస్ పార్టీ కాదని కోర్టులో అఫిడవిట్ వేశారని సరిత వర్గీయులు సభ దృష్టికి తెచ్చారు. ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్ కలగజేసుకుని పక్షం రోజుల్లో సమస్య పరిష్కారం అవుతుందని సముదాయించారు.

పేదల చెంతకు అంతర్జాతీయ స్థాయి విద్య

- మొదటి విడతలో ఉమ్మడి జిల్లాలో పది గురుకులాలు
- 20 నుంచి 25 ఎకరాల స్థలంలో నిర్మాణం
- సకల సౌకర్యాలతో సమీకృత గురుకుల పాఠశాలలు



గతేడాది అక్టోబరు 11న శంకుస్థాపన చేస్తున్న ఎంపీ మల్లురవి, ఎమ్మెల్యే వంశీకృష్ణ

అచ్చంపేట, మార్చి 26, (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలోని పేద విద్యార్థులకు ఒకేచోట అంతర్జాతీయ స్థాయి సౌకర్యాలతో విద్యనందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అందించనున్నది. ఇందుకు యంగ్ ఇండియా సమీకృత గురుకులాల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. ఉమ్మడి పాలమూరు జిల్లాలో మొదటి విడతలోనే 10 నియోజక వర్గాలలో ఈ గురుకులాలు ఏర్పాటు కానున్నాయి. ఒక్కో గురుకులానికి రూ. 200 కోట్లు కేటాయించింది. సమీకృత గురుకుల పాఠశాలలో ఐదు నుంచి ఇంటర్ వరకు చదువుకొనే వీలుంటుంది.

ఉమ్మడి జిల్లాలో 10 సమీకృత గురుకులాలు

మొదటి విడతలో యంగ్ ఇండియా సమీకృత గురుకులాలు ఉమ్మడి పాలమూరు జిల్లాలోని 14 నియోజక వర్గాలకు గాను 10 నియోజకవర్గాలకు మంజూరు చేశారు. అచ్చంపేట, కల్వకుర్తి, కొల్లాపూర్, నాగర్‌కర్నూల్, నారాయణపేట, వనపర్తి, గద్వాల, మక్తల్, జడ్చర్ల, దేవరకద్ర, నియోజకవర్గాలలో గురుకులాలను ఏర్పాటు చేయనున్నారు. నాగర్‌కర్నూల్ జిల్లాలో ఉప్పునుంతల మండలం రాయిచేడ్, పెంట్లవెల్లి మండలం జెట్‌ప్రోల్, నాగర్‌కర్నూల్ మండలం తూడుకుర్తి, తలకొండపల్లి మండలం కోనాపూర్ గ్రామాలలో ఏర్పాటు చేయనున్నారు. ఇప్పటికే కొన్ని చోట్ల శంకుస్థాపన చేశారు. కొల్లాపూర్ నియోజకవర్గం పెంట్లవెల్లి మండలం జెట్‌ప్రోల్ గ్రామంలో ముఖ్యమంత్రి చేతుల మీదుగా శంకుస్థాపన చేసేందుకు ఏర్పాట్లు చేశారు.

అన్ని హంగులతో నిర్మాణాలు

రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మించ తలపెట్టిన యంగ్ ఇండియా సమీకృత గురుకులాలు 20 ఎకరాల స్థలంలో రూ. 200 కోట్లతో నిర్మించనున్నారు. రాష్ట్రంలో నిర్మించనున్న సమీకృత గురుకులాలకు ఈ నెల 8న రూ.11 వేల కోట్ల నిధులు కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి

జాతరలో భక్తులకు సౌకర్యాలు కల్పించాలి

చారకొండ, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) సిర్సనగండ్ల సీతారామచంద్రస్వామి బ్రహ్మోత్సవాల్లో భక్తులకు సౌకర్యాలు కల్పించాలని కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా చారకొండ మండలంలోని సిర్సనగండ్ల దేవాలయంలో బుధవారం ఆలయ చైర్మన్ దేరం రామశర్మ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు తాగునీరు, వైద్యం, రవాణా సమస్యలు తలెత్తకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. బ్రహ్మోత్సవాల్లో ఆవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా చర్యలు తీసుకోవాలని కల్వకుర్తి డీఎస్పీ వెంకటేశ్వర్లుకు సూచించారు. అంతకముందు సీతారామచంద్ర స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్యేను ఆలయ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జడ్పీ మాజీ వైస్ చైర్మన్ ఠాగూర్ బాలాజీసింగ్, తహసీల్దార్ అద్దంకి సునిత, ఎంపీడీవో ఇసాక్ హుస్సేన్, ఆలయ ఈవో స్వర్గం అంజనేయులు, సీఐ, ఎస్‌ఐ తదితరులు ఉన్నారు.

ప్రశాంతంగా ‘పది’ పరీక్షలు

» కేంద్రాలను పరిశీలించిన ఉన్నతాధికారులు 7

మూల్యాంకనం కోడింగ్ పకడ్బందీగా నిర్వహించాలి



జిల్లా కేంద్రంలో పరీక్ష మూల్యాంకన పర్యవేక్షణ అధికారులతో మాట్లాడుతున్న డీఈవో రమేష్‌కుమార్

నాగర్‌కర్నూల్ టౌన్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : పదో తరగతి పరీక్షల జవాబు పత్రాలకు కోడింగ్ ప్రక్రియను అత్యంత పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా విద్యాశాఖాధికారి రమేష్‌కుమార్ అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లా కేంద్రంలోని లిటిల్ ఫ్లవర్ హైస్కూల్‌లోని పది పరీక్షల మూల్యాంకన కేంద్రాన్ని డీఈవో పరిశీలించారు. భద్రపరిచిన జవాబు పత్రాల గదిని తనిఖీ చేసి నేటి నుంచి ప్రారంభం కానున్న కోడింగ్ ప్రక్రియకు తీసుకోవాల్సి జాగ్రత్తలను పర్యవేక్షణ అధికారులకు సూచించారు. డీఈవో మాట్లాడుతూ పది జవాబు పత్రాల్లో విద్యార్థి వివరాలను తొలగించి కోడింగ్ చేసి మూల్యాంకనం అనంతరం కోడింగ్‌తో విద్యార్థి వివరాలను అనుసంధానం చేయడం అత్యంత కీలకమన్నారు. కోడింగ్‌లో ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా చేసేలా సజావుగా నిర్వహించాలని ఆయన సూచించారు. శిక్షణ సమావేశంలో జిల్లా పరీక్షల అధికారి రాజశేఖర్‌రావు, చీఫ్ కోడింగ్ అధికారులు కురుమయ్య, యాదగిరి, సహాయ అధికారులు లత, నాగరాజు, కృష్ణారెడ్డి, సత్యనారాయణరెడ్డి, వెంకటయ్య, పాండు పాల్గొన్నారు.

అభ్యుదయ కవిత్వంతో ప్రజా చైతన్యం

▸ కవి, సాహితీవేత్త, ఆచార్య ఎస్వీ సత్యనారాయణ



సాహితీ సదస్సులో మాట్లాడుతున్న ఎస్వీ సత్యనారాయణ

గద్వాల టౌన్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : అభ్యుదయ కవిత్వం ప్రజల్లో నూతన చైతన్యాన్ని తీసుకువచ్చిందని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం పూర్వ అధ్యక్షుడు, కవి, సాహితీవేత్త, ఆచార్య ఎస్వీ సత్యనారాయణ అన్నారు. అందుకు కందుకూరి వీరేశలింగం, గురజాడ అప్పారావు, దాశరథి, గరిమెళ్ల సత్యనారాయణ, శ్రీశ్రీ వంటి కవుల రచనలు ఉదాహరణలుగా వివరించారు. 'అభ్యుదయ కవిత' అనే అంశంపై జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని మహారాణి ఆదిలక్ష్మీ దేవమ్మ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం ఏర్పాటు చేసిన విస్తృత ఉపన్యాసం కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాచీన కవిత్వానికి, అభ్యుదయ కవిత్వానికి మధ్య తేడా కేవలం పదాలు మాత్రమేనని, భావం ఒక్కటేనన్నారు. దేవు లపల్లి కృష్ణశాస్త్రి వంటి కవులు భావ కవిత్వం, శ్రీశ్రీ వంటి అభ్యుదయ కవుల రచనలకు ప్రజా చైతన్యమే లక్ష్యమైనా, వాడిన పదాలు, కవితా శైలి మాత్రం వేరే అన్నారు. ప్రాచీన, అభ్యుదయ కవులకు సంబంధించిన అనేక రచనలను, వాటి మధ్య ఉన్న వైవిధ్యం, సంబంధాలను విద్యార్థులకు వివరించారు. జయమిత్ర సాహిత్య, సాంస్కృతిక వేదిక అధ్యక్షుడు ఆ చార్య చెన్నకేశవరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమానికి గద్వాల పీజీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చవ్వా వెంకట్ రెడ్డి, తెలుగు విభాగం అధిపతి డాక్టర్ మేడిచర్ల హరినాగభూషణం విశిష్ట అతిథిలుగా హాజర య్యారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ షేక్ కలందర్ బాషా, పీజీ కేం ద్రం, ఎంఏఎల్‌డీ కళాశాల అధ్యాపకులు డాక్టర్ మంగళగిరి శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, శంకర్, శ్రీరాములు, గద్వాల సాహితీ సభ్యులు డాక్టర్ అంబటి భానుప్రకాష్, ఇక్బాల్ అహ్మద్, కృష్ణయ్య, రఫిక్, రాములు పాల్గొన్నారు.

ఉగాది నాటికి ఇందిరమ్మ మోడల్ ఇల్లు నిర్మాణం పూర్తి

▸ గృహ నిర్మాణ శాఖ డీఈ విఠోబా



ఖిల్లాఘణపురంలో నమూనా ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పనులను పరిశీలిస్తున్న గృహ నిర్మాణ శాఖ డీఈ విఠోబా

ఖిల్లాఘణపురం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): ఉగాది పండుగ నాటికి ఇందిరమ్మ మోడల్ ఇల్లు నిర్మాణం పూర్తి చేస్తామని గృహ నిర్మాణ డీఈ విఠోబా తెలిపారు. మండల పరిషత్ కార్యాలయం సముదాయం ఆవరణంలో నిర్మిస్తున్న ఇందిరమ్మ మోడల్ ఇల్లును బుధవారం గృహ నిర్మాణ శాఖ డీఈ విఠోబా పరిశీలించారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల అవగాహన నిమిత్తం ప్రతి మండల కేంద్రంలో నమూనా ఇందిరమ్మ ఇల్లు నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. ఇందిరమ్మ ఇంటిని లబ్ధిదారులు 400 చదరపు ఫీట్ల నుంచి 625 చతరపు ఫీట్ల వరకు నిర్మించుకునే అవకాశం ఉందని తెలిపారు. లబ్ధిదారుడికి విడతల వారీగా ప్రభుత్వం ఐదు లక్షలు మంజూరు చేస్తుందని అన్నారు. ప్రభుత్వం అందించే ఐదు లక్షలతో ఇందిరమ్మ ఇల్లు నిర్మాణం పూర్తి చేసుకునే అవకాశం ఉందని తెలిపారు. వనపర్తి జిల్లాలోని కొత్తకోట, ఖిల్లాఘణపురం, వనపర్తి మండలాల్లో నిర్మిస్తున్న ఇందిరమ్మ నమూనా ఇళ్ల ఉగాది పండుగ నాటికి పూర్తి చేసి ప్రారంభిస్తామని అన్నారు. మండలంలోని సల్కెలాపూర్ గ్రామానికి మంజూరైన 100 ఇందిరమ్మ ఇళ్ల ప్రభుత్వ నిబంధనల మేరకు లబ్ధిదారులు నిర్మించుకోవాలని అన్నారు. ఇప్పటికే ఆ గ్రామంలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణం కొనసాగుతుందని గుర్తు చేశారు. ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి మండలంలోని ఒక గ్రామాన్ని ఎంపిక చేసి పైలెట్ ప్రాజెక్టుగా పూర్తి చేస్తున్నట్లు తెలిపారు. పూర్తి చేసిన నమూనా ఇందిరమ్మ ఇళ్లను వచ్చే నెల 1వ తేదీ వరకు ఎమ్మెల్యే మేఘారెడ్డి చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు తెలిపారు.




తిమ్మాజిపేట మండలం నేరెళ్ళపల్లిలో పింఛన్‌కోసం వేచి ఉన్న వృద్ధులు

పింఛన్ల కోసం పండుటాకుల పరేషాన్

అసలే ఏడు పదులు దాటిన వయసు, పింఛన్ డబ్బు ఇస్తుండటంతో గ్రామ పంచాయతీ వద్దకు చేరుకున్నారు. వయసు మీరడంతో వేలి ముద్రలు పడటం లేదు. దీంతో ఒకటికి పది సార్లు ఒత్తాల్సి వస్తోంది. దీంతో పింఛన్ ఇచ్చేందుకు బాగా సమయం పడుతోంది. అంతవరకు క్యూలో నిలబడే ఓపిక లేకపోవడం, ఎండ తీవ్రం కావడంతో అక్కడే ఉన్న ఓ చెట్టు నీడన కూర్చొని తమ వంతు కోసం ఎదురుచూస్తూ ఉన్నారు. ఈ దృశ్యం నాగర్‌కర్నూల్ జిల్లా, తిమ్మాజీపేట మండలం, నెరెళ్లపల్లిలో 'ఆంధ్రజ్యోతి' కెమెరా కంట పడటంతో 'క్లిక్' మనిపించింది.

- తిమ్మాజీపేట, (ఆంధ్రజ్యోతి)



నిరుపయోగంగా స్కానింగ్ యంత్రం

గర్భిణులపై స్కానింగ్ భారం

▸ ప్రభుత్వ ఆసుపత్రిలో మూతపడ్డ స్కానింగ్ కేంద్రం

వనపర్తి వైద్యవిభాగం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి లో గైనకాలజిస్టు సేవలు ఊహించిన దాని కంటే అధికాంగానే మెరుగుపడ్డాయి. కానీ గర్భిణీలు తమ బిడ్డను నవ మాసాలతో పాటు ఆర్థిక భారం కూడా మోయాల్సి వ స్తోంది. గర్భం దాల్చినప్పటి నుంచి ప్రసవం జరిగే వరకు అతి ముఖ్యమైనవి స్కానింగ్ సేవలు. అలాంటి స్కానింగ్ సేవలు ప్రభు త్వ ఆసుపత్రిలో అందుబాటులో లేకపోవ డంతో ప్రైవేటు స్కానింగ్ కేంద్రాలను ఆశ్రయిస్తున్నారు. ఒక్కొక్క గర్భిణికి దాదాపు రూ. 5 వేల వరకు ఆర్థిక భారం తప్పడం లేదు.

ఏఎన్‌సీ చెకప్ తప్పనిసరి...

గర్భిణీలకు ఏఎన్‌సీ (యాంటీ నెంటల్ చెకప్) చెకప్ వైద్యుల పర్యవేక్షణలో నాలుగు దఫాలుగా చేస్తారు. మొదటగా డిటక్షన్ కోసం, 3వ నెలలో, 6వ నెలలో, 9వ నెలలో తప్పనిసరిగా ఏఎన్‌సీ చెకప్ చేయాల్సి ఉంటుంది.



మూతపడిన స్కానింగ్ రూం

వైద్యుల సలహాలతో గర్భంలో పిండం పెరుగుదల, కదలిక, అవయవాల ఎదుగుదల, సంపూర్ణ ఆరోగ్యం వంటి వివరాలను స్కానింగ్ చేయడం ద్వారా నివృత్తం అవుతాయి. ఇలా ఒక్కొక్క గర్భిణీ నాలుగు సార్లు స్కానింగ్ పొందాలంటే ప్రైవేటు స్కానింగ్ కేంద్రాలను ఆశ్రయిం చాల్సి వస్తుంది. దీంతో ఒక్కో గర్భిణికి ఒక్కోసారి రూ. 1,200 ఖర్చు చేయడం వల్ల సుఖ ప్రసవం జరిగే వరకు కేవలం ఒక్క స్కానింగ్ కోసమే రూ. 5 వేల ఆర్థిక భారం మోయాల్సిన పరిస్థితి ఏర్పడింది.

డిపార్టుమెంట్ మొత్తం ఖాళీ..

గర్భిణులకే కాకుండా రోగులకు కూడా స్కానింగ్ సేవలు అందించే రేడియాలజిస్ట్ డిపార్ట్‌మెంట్ వనపర్తి ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో మొత్తం ఖాళీగా ఉంది. ప్రొఫెసర్, అసోషియేట్ ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్, సీనియర్ రెసిడెంట్ ఇలా మొత్తం ఖాళీగా ఉంది. 2022 బ్యాచ్‌కు ప్రభుత్వం నిర్వహించాల్సిన కౌన్సెలింగ్ ఆలస్యం కావడం వల్ల ఎస్ఆర్ (సీనియర్ రెసిడెంట్) డాక్టర్లు రాలేకపోయారని తెలుస్తోంది.

స్టేట్‌లో 3వ స్థానంలో..

వనపర్తి ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి అత్యధిక కాన్పులు జరుగుతున్న ఆసుపత్రిగా రాష్ట్రంలోనే 3వ స్థానంలో ఉంది. ఇక్కడ ప్రతి రోజు గర్భిణులు 200 నుంచి 250 వరకు వైద్య సేవలను పొందుతున్నారు. అడ్మిట్ అయిన వారిలో ప్రతీ రోజు 15 నుంచి 20 కాన్పులు జరుగుతున్నాయి. ప్రతీ నెల 400కు పైగానే కాన్పులు చేస్తున్నారు. ఇంతటి ఘనకీర్తి గల ఆసుపత్రికి రేడియాలజిస్టు వైద్యులు లేకపోవడం గర్భిణులకు శాపంగా మారింది.

కౌన్సెలింగ్ ప్రక్రియ జరుగుతోంది



ప్రస్తుతం ఎస్ఆర్ వైద్యులకు కౌన్సెలింగ్ ప్రక్రియ జరుగుతోంది. త్వరలోనే రేడియాలజి డిపార్ట్‌మెంట్‌కు ఎస్ఆర్ వైద్యులు రానున్నారు. స్కానింగ్ సమస్యను కలెక్టర్‌తో పాటు డీఎంఈ దృష్టికి తీసుకెళ్లినా.. వీలైనంత ఎక్కువ మంది రేడియాలజిస్టులను వనపర్తికి అపాయింట్ చేస్తారని ఆశిస్తున్నాం.

- డాక్టర్ రంగారావు, సూపరింటెండెంట్, వనపర్తి

సాధారణ ప్రసవాల సంఖ్య పెంచాలి

▸ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ శ్రీనివాసులు



ప్రైవేటు ఆసుపత్రుల వైద్యులతో సమావేశమైన డీఎంహెచ్‌వో డాక్టర్ శ్రీనివాసులు

వనపర్తి వైద్యవిభాగం/పెబ్బేరు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): ప్రైవేటు హాస్పిటల్స్‌లో సాధారణ ప్రసవాల సంఖ్య పెంచాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అల్లె శ్రీనివాసులు ఆదేశించారు. బుధవారం ప్రైవేటు డెలివరీ ఆసుపత్రుల వైద్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ ప్రైవేటు హాస్పిటల్స్‌లో జరిగే యూపీటీ పరీక్షల వివరాలను ఎప్పటికప్పుడు రోజువారిగా గూగుల్ షీట్‌లో అప్లోడ్ చేయాలన్నారు. ఆసుపత్రులకు వచ్చే పేషంట్ వివరాలను సక్రమంగా నమోదు చేసి డీఎంహెచ్‌వో కార్యాలయానికి అడిగిన వెంటనే చేరవేయాలన్నారు. ప్రస్తుతం ప్రైవేటు ఆసుపత్రుల్లో ఆపరేషన్ శాతమే ఎక్కువగా ఉందని, తగ్గించి సాధారణ ప్రసవాల సంఖ్యను పెంచాలన్నారు. కొన్ని ప్రైవేటు ఆసుపత్రుల్లో ఏకంగా 90 శాతం ఆపరేషన్లే చేస్తున్నారని, అలాంటి ఆసుపత్రుల పై చర్యలు తీసుకోనున్నట్లు హెచ్చరించారు. అంతేకాకుండా ఎవరైన అబార్షన్స్ చేసినట్లు తెలిస్తే ఆసుపత్రి రిజిస్ట్రేషన్ రద్దు చేయడమే కాకుండా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ ఝాన్సీ, డాక్టర్ శ్రీనివాసులు, ప్రైవేటు ఆసుపత్రుల వైద్యులు పాల్గొన్నారు.

● ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవాల సంఖ్య పెరగాలని డీఎంహెచ్‌వో డాక్టర్ శ్రీనివా సులు తెలిపారు. బుధవారం ప్రభుత్వ ప్రాథ మిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. ప్రభు త్వ ఆసుపత్రిలో సిబ్బందితో పిల్లలకు వ్యాధి నిరోధక టీకాలు , కుటుంబ నియంత్రణ తదితర అంశాలపైన పలు సూచనలు చేశారు. గర్భిణీలకు సంబంధించి ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు వివరాలు సేకరించాలన్నారు. పల్లె దవాఖానా వైద్యులు చంద్రశేఖర్, హెల్త్ సూపర్ వైజర్లు లీలమ్మ, పార్వతి, రాజశేఖర్, కుమారి, రాజేష్ గౌడ్, విజయలక్ష్మి, సిబ్బంది ఉన్నారు.

రైతుల సంక్షేమమే ధ్యేయం

▸ డీసీసీబీ చైర్మన్ మామిళ్లపల్లి విష్ణువర్ధన్ రెడ్డి



మాట్లాడుతున్న డీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి

పాన్‌గల్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : రైతుల సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తామని డీసీసీబీ చైర్మన్ మామిళ్లపల్లి విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. వనపర్తి జిల్లా, పాన్‌గల్ మండల కేంద్రంలోని రైతు వేదికలో ఆయన అధ్యక్షతన పాలక మండలి సభ్యులతో మహాజన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వానాకాలం, యాసంగి సీజన్లకు గాను కొత్త రైతులు 887 మందికి స్వల్పకాలిక రుణాలు దాదాపు రూ. 6,57,887 ఇచ్చినట్లు తెలిపారు. ఏకకాల రుణ పరిష్కారం (ఓటీఎస్) కింద అపరాధ వడ్డీలో వంద శాతం పథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సింగిల్‌విండోలో రెండు లక్షల లోపు 3,102 మంది రైతులకు రూ.9.94 కోట్లు రుణాలు మాఫీ అయినట్లు తెలిపారు. సింగిల్ విండోలో అన్ని రకాల బ్యాంకింగ్ సేవలను అందుబాటులోకి తెచ్చినట్లు చెప్పారు. ప్రభుత్వం ప్రవేశ పెట్టిన యువ వికాసం పథకాన్ని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. దీంతో పాటు ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని, అలాగే ఆరు శాతం వడ్డీతో వ్యవసాయ పనిముట్లను కూడా అందిస్తున్నామని తెలిపారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గోవర్ధన్ సాగర్ మాట్లాడుతూ విండో ద్వారా ఇచ్చే రుణాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పంట రుణాలతో పాటు, విద్య, ఇంటి నిర్మాణం, ఉపాధి తదితరాల కోసం రుణాలు అందిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సింగిల్‌విండో సీఈవో భాస్కర్ గౌడ్, వైస్ చైర్మన్ బాలయ్య డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు.



ఉపాధి కోసం నిత్యం ఇలా నది దాటి రావాల్సిందే



పనులు ముగిసిన తర్వాత నది ఒడ్డున ట్రాక్టర్ దిగుతున్న ఏపీలోని సింగవరం గ్రామ కూలీలు

ఏరు దాటితేనే ఉపాధి

▸ తుంగభద్రను దాటి వస్తున్న ఆంధ్రప్రదేశ్ కూలీలు

అలంపూరు చౌరస్తా, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : ఉపాధి కోసం వారు ఏరు దాటి వస్తున్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని సింగవరం, నిడ్జూరు, మునగాల, కొత్తకోట, ఎదురూరు తదితర గ్రామాలకు చెందిన కూలీలు పని కోసం తుంగభద్ర నదిని దాటి జోగుళాంబ గద్వాల జిల్లాకు వస్తున్నారు. ఉండవల్లి మండల పరిధిలోని పుల్లూరు, కలుగొట్ల, మెన్నిపాడు, మానవపాడు మండలంలోని కొర్విపాడు, మద్దూరు తదితర నదీతీర గ్రామాల శివార్లలో రైతులు మిర్చితో పాటు వాణిజ్య పంటలు విరివిగా సాగు చేశారు. ప్రస్తుతం అవి కోత దశకు చేరుకోవడంతో స్థానిక కూలీలకు విపరీతమైన డిమాండ్ ఏర్పడింది. ఇదే సమయంలో తుంగభద్ర నది ఆవతలివైపు ఉన్న సింగవరం, నిడ్జూరు, మునగాల, కొత్తకోట, ఎదురూరు తదితర గ్రామాలలో కోతలు పూర్తయి కూలీలు ఉపాధి కోసం ఎదురు చూస్తున్నారు. వారందరి ఉపాధికి మన ప్రాంతం నెలవుగా మారింది. ఆయా గ్రామాలకు మధ్య తుంగభద్ర నది అడ్డుగా ఉన్నా, దారి లేకపోయినా, ప్రస్తుతం నదిలో నీరు లేకపోవడంతో కూలీలు పని కోసం నది దాటి వస్తున్నారు. ఒడ్డు నుంచి రైతుల ట్రాక్టర్లలో పొలాలకు వచ్చి పనులు ముగించుకుని తిరిగి ఒడ్డున దిగి కాలినడకన నదిని దాటి వెళ్తున్నారు. ఇలా మిర్చి కోతలకు వస్తే రోజుకు రూ.350 ఇస్తారని ఏపీలో సింగవరం గ్రామ కూలీలు తెలిపారు.

జోగుళాంబ ఆలయ హుండీ లెక్కింపు



ఆలయం హుండీని లెక్కిస్తున్న సేవా సంస్థల మహిళలు

అలంపూరు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లా, అలంపూరు జోగుళాంబ బాల బ్రహ్మేశ్వర స్వామి ఆలయంలో బుధవారం హుండీ లెక్కించారు. దేవాదాయ శాఖ, మహబూబ్‌నగర్ సహాయ కమిషనర్ కమీషనర్ మదనేశ్వర్‌రెడ్డి పర్యవేక్షణలో లెక్కింపు కొనసాగింది. మొత్తం 106 రోజుల హుండీని లెక్కించగా, అమ్మ వారి హుండీ ద్వారా 60,76,562, స్వామి వారి హుండీ 11,79,888, అన్నదాన సత్రం 38,889 ద్వారా మొత్తంగా 72,95,339 రూపాయల ఆదాయం సమకూరింది. దీంతో పాటు విదేశీ కరెన్సీ యూఎస్ డాలర్స్ 14, మలేషియన్స్ కరెన్సీ 7, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఒమన్ రైలు 1, మిశ్రమ బంగారం 56, మిశ్రమ వెండి 222 గ్రాములు వచ్చింది. కార్యక్రమంలో ఈవో పురేందర్ కుమార్, చైర్మన్ కొంకల నాగేశ్వర్ రెడ్డి, ధర్మకర్తలు వెంకటేశ్వర్లు, అర్చకులు, సిబ్బంది, గద్వాల, కొత్తకోట, కర్నూలు, హైదరాబాద్‌లకు చెందిన వివిధ సేవా సంస్థల సభ్యులు పాల్గొన్నారు.

అభయుడి హుండీ లెక్కింపు



ఊర్కొండపేట అభయాంజనేయస్వామి ఆలయంలో హుండీ లెక్కిస్తున్న భక్తులు, అధికారులు

ఊర్కొండ, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా ఊర్కొండ మండలం ఊర్కొండపేట అభయాంజనేయస్వామి ఆలయంలో హుండీని బుధవారం దేవాదాయ, ధర్మాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ వీణా. దరి, ఆలయం చైర్మన్ సత్యనారాయణరెడ్డిల ఆధ్వర్యంలో లెక్కించారు. 2025 జనవరి 20 నుంచి బుధవారం వరకు భక్తులు సమర్పించిన నగ దు రూ. 5,10,977 వచ్చినట్లు ఆలయం కార్యనిర్వహణాధికారి సత్యచంద్రారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ కృష్ణదేవ, ధర్మకర్తల మండలి సభ్యులు వెంకటమ్మ, బొందయ్యగౌడ్, మల్లేష్ యాదవ్, రమేష్, వెంకటయ్య, నాయకులు మనోహర్ రెడ్డి, శ్రీశైలం, అర్చకులు మహేష్‌శర్మ, ప్రవీణ్‌శర్మ, శ్రీనివాసశర్మ ఆలయం సిబ్బంది శ్రీశైలం, మారుతిరావు, వరలక్ష్మి, భక్తులు ఉన్నారు.

రెస్క్యూ ఆపరేషన్ వేగవంతం

▸ ఎస్ఎల్‌బీసీలో సొరంగం లోపలికి నాలుగు ఎక్స్‌కవేటర్లు
▸ సహాయక చర్యలను పరిశీలించిన ప్రత్యేక అధికారి
▸ కన్వేయర్ బెల్టు సమీపంలోనే దుర్వాసన
▸ మనోజ్‌కుమార్ మృతదేహం దొరికిన ప్రాంతంలో అన్వేషణ



ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో సహాయక చర్యలు

నాగర్‌కర్నూల్, దోమలపెంట, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : శ్రీశైలం ఎడమగట్టు సొరంగంలో(ఎస్ఎల్‌బీసీ) సహాయక చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. మిగతా ఆరుగురి ఆచూకీ కనుగొనేందుకు రెస్క్యూ సిబ్బంది లోపల పరిస్థితిని తమకు అనుకూలంగా మార్చుకునేందుకు సర్వశక్తులొడ్డుతున్నారు. మంగళవారం ఇంజనీర్ మనోజ్‌కుమార్ మృత దేహం లభించిన ప్రాంతాన్ని ప్రత్యేకంగా మార్కింగ్ వేశారు. ఆ జోన్‌లోనే దుర్వాసన వస్తుండడంతో మ్యానువల్‌గా మట్టిని తొలగించే ప్రయత్నాలను ఐదు షిఫ్టులల్లో కొనసాగిస్తున్నారు. టన్నెల్ లోపల వస్తున్న ఊట నీటిని వేగంగా బయటకు పంపింగ్ చేసి 2.5కిలో మీటర్లకు ఒక పంపింగ్ స్టేషన్ చొప్పున 150హెచ్‌పీల సామర్థ్యం గల మోటార్లు పని చేస్తున్నాయని రెస్క్యూ బృందానికి సారథ్యం వహిస్తున్న అధికారులు ప్రత్యేక అధికారికి తెలిపారు.

మూడు రోజుల పాటు కన్వేయర్ బెల్టు పునరుద్ధరణ

సహాయక చర్యలు వేగవంతం చేసేందుకు కన్వేయర్ బెల్టును పొడిగించాలని రెస్క్యూ టీమ్ నిర్ణయించింది. ఇప్పటి వరకు 13.5కిలో మీటర్ల వరకు మాత్రమే లోకో ట్రైన్ వెళ్తుంది. కన్వేయర్ బెల్టును ఇంకా 150మీటర్ల వరకు పునరుద్ధరించే ప్రక్రియ నేటి నుంచి ప్రారంభం కానుంది. మొత్తం పూర్తయ్యే వరకు మూడు రోజుల సమయం పడుతుంది. అంతవరకు లోకో ట్రైన్ శిథిలాలు టన్నెల్ బోరింగ్ మిషన్ శిథిలాలను లోకో ట్రైన్ ద్వారా బయటకు పంపించే ప్రయత్నాలను ముమ్మరం చేయాలని ఉన్నతాధికారులు నిర్ణయించారు.

అనుమతిస్తే అవాంతరాలు తొలగినట్లే

(5వ పేజీ తరువాయి)

ఇది సాధ్యమయ్యే పనికాదు. మన్నెవారి పల్లి నుంచి వస్తున్న టీబీఎం ఇప్పటికే 20 కిలోమీటర్లు దాటింది. ఇంకా 3 కిలోమీటర్లు తవ్వితే దాని టార్గెట్ చేరుకుంటుంది. ఇప్పుడు అది కూడా బేరింగ్ పోయి మరమ్మతులో ఉన్నది. అక్కడి నుంచి టన్నెల్ పూర్తిచేయాలని అనుకున్నా షీర్ జోన్ వస్తే మరింత ప్రమాదమే అవుతుంది. ఇప్పుడు మిగిలిన దూరం బైపాస్ లా పూర్తిచేయాలంటే డీబీఎం అవసరం అయితే ఈ ప్రాజెక్టు ప్రారంభంలోనే టైగర్ రిజర్వ్ కావడం వల్ల బ్లాస్టింగ్‌కు అనుమతులు లభించలేదు. అందుకే టీబీఎంతో తవ్వకం చేపట్టారు. ఇప్పుడు కూడా అదే అడ్డంకిగా మారనుంది. మరి ఈ విషయంలో ప్రభుత్వం ఎలా ముందుకు వెళ్తుందో వేచిచూడాలి. ఈ ప్రాజెక్టు 2005 ఆగస్టు 11న రూ. 2813 కోట్ల నిర్మాణ అంచనాలతో చేపట్టడానికి ప్రభుత్వం పరిపాలనా అనుమతులు ఇవ్వగా రూ. 2259 కోట్లతో ఈపీసీ విధానంలో టెండర్లు అయ్యాయి. 9 శాతం తక్కువకు రూ. 1925 కోట్లతో జేపీ అసోసియేట్స్ పనులు దక్కించుకొని ఇప్పటివరకు రూ. 2689 కోట్ల మేర పనులు పూర్తయ్యాయి. ప్రస్తుత అంచనాలు రూ. 4637 కోట్ల వరకు సవరించారు.

నవోదయ ప్రవేశ పరీక్ష ఫలితాలు విడుదల

బిజినేపల్లి, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన వట్టెం జవహర్ నవోదయ విద్యాలయం 6వ, 9వ తరగతి ప్రవేశ పరీక్షల ఫలితాలు విడుదలైనట్లు విద్యాలయం ప్రిన్సిపాల్ పి.భాస్కర్ కుమార్ బుధవారం తెలిపారు. 6వ తరగతిలో ప్రవేశానికి ఎంపికైన 75 మంది విద్యార్థులు, 9వ తరగతిలో ప్రవేశం పొందేందుకు ఎంపికైన 13 మంది విద్యార్థుల వివరాలను నవోదయ వెబ్ సైట్‌లో ఉంచినట్లు తెలిపారు. అలాగే దరఖాస్తు సమయంలో ఇచ్చిన ఫోన్ నెంబర్లకు, చిరునామాకు వాట్సప్ మెసేజ్‌ల సమాచారం అందించడంతో పాటు అవసరమైన ఫారాలను పంపుతున్నామని అన్నారు. విద్యార్థుల సమాచారం, ధ్రువపత్రాలను వ్యక్తిగతంగా సేకరిస్తామని, ఎవ్వరు కూడా విద్యాలయానికి రావాల్సిన అవసరం లేదని విద్యార్థులకు, తల్లిదండ్రులకు తెలిపారు.



పాన్‌గల్ మండలంలోని కేజీబీవీ పాఠశాలలో అదనపు గదుల నిర్మాణం

'పీఎం శ్రీ'కి 30 పాఠశాలలు

- మూడో విడత ఎంపికకు అధికారుల ప్రతిపాదన
- మొదటి విడతలో 10, రెండో విడతలో 11 స్కూల్స్ ఎంపిక

వనపర్తి విద్యావిభాగం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించడం, విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంపై కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చి దిద్దేందుకు పీఎంశ్రీ యోజన (ప్రధానమంత్రి స్కూల్ ఫర్ రైజింగ్ ఇండియా) కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. విద్యాశాఖలో సమూల మార్పులను తీసుకొచ్చి, రాబోయే తరానికి అవసరమైన అన్ని రకాల నైపుణ్య శిక్షణలను పాఠశాల స్థాయి నుంచే అందించాలన్న ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తోంది. ఈ పథకం కింద ఇప్పటికే రెండు విడతలుగా వనపర్తి జిల్లాలోని 21 విద్యాలయాలు ఎంపికయ్యాయి. అందులో మొదటి విడతలో 10, రెండో విడతలో 11 పాఠశాలలను ఎంపిక చేశారు. ఈ ఏడాది మూడో విడత కింద 30 పాఠశాలలకు ప్రతిపాదనలను పంపించారు. ఇప్పటికే మూడో దశ ఎంపికకు సంబంధిత శాఖ అధికారులు కసరత్తు ప్రారంభించారు.



పీఎం శ్రీ నిధులతో నిర్మిస్తున్న అదనపు గదులు

ఒక్కో పాఠశాలకు రూ.1.15 కోట్లు

పీఎం శ్రీ యోజన కింద ఎంపికైన పాఠశాలల్లో కేంద్ర ప్రభుత్వం అన్ని రకాల సౌకర్యాలను కల్పిస్తోంది. ఎంపికైన ఒక్కో పాఠశాలకు ఐదు సంవత్సరాలకు రూ. 1.15 కోట్లు ఖర్చు చేయనున్నది. ఈ నిధులతో అదనపు తరగతి గదుల నిర్మాణం, ఇంటర్నెట్ సౌకర్యం, క్రీడా మైదానాల ఏర్పాటు, క్రీడా సామాగ్రి సమకూర్చుకోవడం, ప్రయోగశాల ఏర్పాటు, శుద్ధ జలం, కంప్యూటర్లు, ట్యాబ్‌లు సమకూర్చుకోవడం, ఏఐ టెక్నాలజీతో విద్యనందించేందుకు అవసరమైన సదుపాయాలను కల్పించడం, పాఠశాలను ప్లాస్టిక్ రహితంగా మార్చడం, పచ్చదనం పెంపు, పరిశుభ్రత తదితర పనులు చేపట్టనున్నారు.

పాన్‌గల్ కస్తూర్బా పాఠశాలలో..

పాన్‌గల్ మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ పాఠశాల రెండో విడతలో పీఎం శ్రీ యోజనకు ఎంపికయ్యింది. ఈ పథకం కింద విడుదలైన నిధుల తో పాఠశాలలో ఐదు అదనపు గదుల నిర్మాణం చేపట్టారు. సైన్స్ ల్యాబ్ ఏర్పాటు చేశారు. 15 ట్యాబ్‌లు, ఒక కంప్యూటర్, 10 ల్యాప్‌టాప్‌లను అందించారు. వీటితో పాఠశాలలో చదువుతున్న దాదాపు 217 మంది విద్యార్థులకు ప్రయోజనం చేకూరుతోంది.

ఎంపిక చేసే విధానం

పాఠశాలల్లో తరగతి గదులు, వసతి, విద్యార్థుల ప్రతిభ, ఉపాధ్యాయులు, విద్యార్థుల సంఖ్య తదితర అంశాలను పరిశీలించి పీఎం శ్రీ పథకానికి ఎంపిక చేస్తారు. అందుకోసం పాఠశాలకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని ప్రధానోపాధ్యాయుడు పీఎం శ్రీ వెబ్‌సైట్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది. ఆ తర్వాత ప్రత్యేక బృందాలు పాఠశాలను క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలిస్తాయి. పరిశీలనలో గ్రామీణ ప్రాంత పాఠశాలలు 60 మార్కులు, పట్టణ ప్రాంత పాఠశాలలో 70 మార్కులు సాధించాల్సి ఉంటుంది. ఈ మార్కుల ఆధారంగానే ఆయా పాఠశాలలు తుది ఎంపికకు అర్హత సాధిస్తాయి.

పెద్ద పులి 'పద్దు'

- నల్లమలలో మొదలైన పులుల గణన
- కొల్లాపూర్ రేంజ్ పరిధిలో 100 సీసీ కెమెరాలతో నిఘా
- గత ఏడాది తొమ్మిది పెద్ద పులుల గుర్తింపు
- ఈ ఏడాది వాటి సంఖ్య పెరిగే అవకాశం
- చిరుతలు, వన్యప్రాణుల సంఖ్య కూడా లెక్కింపు



కొల్లాపూర్ నల్లమల అటవీ ప్రాంతంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలతో మూగజీవాల చిత్రాలను గుర్తిస్తున్న దృశ్యం

కొల్లాపూర్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లాలోని నల్లమల అటవీ ప్రాంతం, బ్లాక్‌ట్రీలో భాగమైన కొల్లాపూర్ అటవీ రేంజ్ అచ్చంపేట, లింగాల పరిధిలో పెద్ద పులులతో పాటు, చిరుతలు, వన్య ప్రాణులు, మూగ జీవాల గణన ప్రారంభమైంది. ప్రతీ సంవత్సరం మార్చి నెలలో అటవీ దినోత్సవం సందర్భంగా పులుల గణన నిర్వహిస్తారు. అందుకోసం కొల్లాపూర్ రేంజ్ పరిధిలోని దట్టమైన అటవీ ప్రాంతంలో జంతువులు ఎక్కువగా సంచరించే ప్రదేశాల్లో అటవీశాఖ అధికారులు 100 సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. వాటిని ఫారెస్టు అధికారులు, బయోలాజిస్టు ఎప్పటికప్పుడు పరిశీలిస్తునే ఉంటారు. సీసీ కెమెరా ఫుటేజీలో నమోదైన చిత్రాల ఆధారంగా నేషనల్ టైగర్ కన్జర్వేటర్ అథారిటీ పెద్ద పులులు, చిరుతలు, వన్య ప్రాణులు, మూగ జీవాల సంఖ్యను తేల్చనున్నది. గత ఏడాది ఎన్టీసీ గ ణాంకాల ప్రకారం కొల్లాపూర్ పరిధిలోని 9 పెద్ద పులులు సంచరిస్తున్నట్లు వెల్లడైంది. ఈ ఏడాది వాటి సంఖ్య మరింత పెరిగి ఉండొచ్చని బయాలజిస్టు రజినీకాంత్ తెలిపారు. అటవీ ప్రాంతంలో వన్య మృగాల వేట, కలప అక్రమ రవాణా అరికట్టేందుకు రెండు లైవ్ కెమెరాలను ఏర్పాటు చేసి నట్లు ఫారెస్టు రేంజర్ చంద్రశేఖర్ తెలిపారు. కొల్లాపూర్ మండల పరిధిలోని సోమశిల అటవీ ప్రాంతంలో ఒకటి, మొలచింతలపల్లి ప రిధిలో మరొకటి ఏర్పాటు చేసినట్లు చెప్పారు. వన్య ప్రాణుల కదలికలను గుర్తించేందుకు అవి సహాయ పడుతున్నాయని అధికారులు చెప్తు న్నారు.



కొల్లాపూర్ నల్లమలలో పెద్ద పులి పాద ముద్ర



అటవీ ప్రాంతంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరా



కొల్లాపూర్ నల్లమల అటవీ ప్రాంతంలో పెద్ద పులుల పాద ముద్రలను గుర్తిస్తున్న అటవీ శాఖ అధికారులు

క్రైం కార్నర్

అనుమానాస్పదంగా ముగ్గురి మృతి

- వనపర్తి జిల్లాలో ఇద్దరు, నాగర్‌కర్నూల్ జిల్లాలో ఒకరు



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

పెబ్బేరు రూరల్/ ఉప్పునుంతల/ ఖిల్లాఘణపురం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : వనపర్తి, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో ఇద్దరు మహిళలు, ఒక వ్యక్తి అనుమానాస్పదంగా మృతి చెందారు. వనపర్తి జిల్లా, పెబ్బేరు మండలం ఎస్ఐ హరిప్రసాద్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. వనపర్తి మండలంలోని ఓ గ్రామానికి చెందిన మహిళ (35)కు, ఇటిక్యాల మండలం, తిమ్మాపురం గ్రామానికి చెందిన గొల్ల మద్దిలేటికి మధ్య వివాహేతర సంబంధం ఉన్నట్లు సమాచారం. మంగళవారం రాత్రి వారిద్దరూ రంగాపురం ఏబీడీ లిక్కర్ కంపెనీ వద్ద కలుసుకున్నారు. ఆ తర్వాత కొద్దిసేపటికి మహిళ స్పృహ తప్పి పడిపోయింది. ఎంత ప్రయత్నించినా ఆమెలో కదలిక లేకపోవడంతో భయపడిన మద్దిలేటి పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి విషయం చెప్పి లొంగిపోయాడు. దీంతో బుధవారం ఉదయం సీఐ రాంబాబు, ఎస్ఐ హరిప్రసాద్‌రెడ్డి, క్లూస్ టీమ్ బృందంతో సంఘటనా స్థలానికి చేరుకున్నారు. అప్పటికే ఆమె చనిపోయి ఉంది. మృతదేహాన్ని వనపర్తి ఆసుపత్రికి తరలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

- నాగర్‌కర్నూల్ జిల్లా, ఉప్పునుంతల మండల కేంద్రంలో మరో మహిళ అనుమానాస్పదంగా మృతి చెందింది. ఎస్ఐ వెంకట్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన బొల్లె శాంతమ్మ (70) మంగళవారం మధ్యాహ్నం స్పృహ తప్పి పడిపోవడంతో కుటుంబసభ్యులు ఉప్పునుంతల ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. వైద్యుల సలహా మేరకు అచ్చంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే ఆమె మృతి చెందింది. అయితే మృతురాలి శరీరంపై కాలిన గాయాలు కన్పించడంతో కుమారుడు వెంకటయ్య అనుమానం వ్యక్తం చేస్తూ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.
- వనపర్తి జిల్లా, ఖిల్లాఘణపురం మండల కేంద్రానికి చెందిన పంతగాని కృష్ణయ్య అనుమానాస్పదంగా మృతి చెందాడు. ఖిల్లాఘణపురం ఎస్ఐ సురేశ్ గౌడ్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అడ్డాకుల మండలం, శాఖాపూర్ గ్రామానికి చెందిన ఉద్దగిరి వెంకన్న వరుసకు అన్న కొడుకు పంతగాని కృష్ణయ్య ఖిల్లాఘణపురంలో నివాసం ఉంటున్నాడు. ఈ నెల 25న అతడు మృతి చెందినట్లు సమాచారం రావడంతో, ఉద్దగిరి వెంకన్న బుధవారం గ్రామానికి చేరుకున్నాడు. అంత్యక్రియలకు ఏర్పాటు చేస్తుండగా, మృతుడు పంతగాని కృష్ణయ్య మోకాళ్లపై గాయాలు, శరీరం పూర్తిగా ఉబ్బిపోయి ఉండటం గమనించాడు. దీంతో అతడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో పోలీసులు అక్కడికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వనపర్తి జిల్లా ఆసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

ఇసుక ఫిల్టర్ ధ్వంసం

రేవల్లి, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : వనపర్తి జిల్లా, రేవల్లి మండలంలోని నాగపూర్ గ్రామ శివారులో అక్రమంగా నిర్వహిస్తున్న ఇసుక ఫిల్టర్‌ను అధికారులు ధ్వంసం చేశారు. ఫిల్టర్ ఇసుకను తయారు చేసి, అక్రమంగా రవాణా చేస్తున్నట్లు సమాచారం అందడంతో ఎస్ఐ రాము, రెవెన్యూ అధికారి ఆర్ఐ శంకర్‌తో కలిసి అక్కడికి చేరుకున్నారు. ఇసుక ఫిల్టర్‌ను ధ్వంసం చేశారు. ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ రాము హెచ్చరించారు.



ఇసుక ఫిల్టర్‌ను ధ్వంసం చేస్తున్న అధికారులు

ప్రశాంతంగా 'పది' పరీక్షలు

- కేంద్రాలను పరిశీలించిన ఉన్నతాధికారులు

మహబూబ్‌నగర్ విద్యా విభాగం/ నారాయణపేట/ వనపర్తి విద్యావిభాగం/ గద్వాల సర్కిల్/ నాగర్‌కర్నూల్ టౌన్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో పదవ తరగతి పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. మహబూబ్‌నగర్ జిల్లాలో బుధవారం నిర్వహించిన గణితం పరీక్షకు 99.69 శాతం విద్యార్థులు హాజరయ్యారు. మొత్తం 12,855 మంది విద్యార్థులకు గాను, 12,815 మంది హాజరయ్యారు. 40 మంది గైర్హాజరయ్యారు. రెగ్యులర్ విద్యార్థులు 12,769 మందికి గాను 12,737 మంది హాజరు కాగా, 32 మంది హాజరు కాలేదు. ప్రైవేట్ విద్యార్థులు 86 మందికి గాను, 78 మంది హాజరయ్యారు. ఎనిమిది మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు.



మిడ్జిల్‌లో పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ విజయేందర బోయి

పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ విజయేందర బోయి అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా, మిడ్జిల్ మండల కేంద్రంలోని రెండు పదవ తరగతి పరీక్ష కేంద్రాలను బుధవారం ఆమెతో పాటు, అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, ఎస్పీ జానకి, అదనపు ఎస్పీ తదితరులు పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పరీక్షలు ప్రశాతంగా కొనసాగేలా చూడాలన్నారు. కేంద్రాల్లో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులూ తలెత్తకుండా జాగ్రత్త వహించాలని సీఎస్, డీవోలకు సూచించారు.

- నారాయణపేట జిల్లాలోని 39 పరీక్ష కేంద్రాల్లో 7,635 మంది విద్యార్థులకు పరీక్షలకు హాజరు కావలసి ఉండగా, 7,617 మంది హాజరయ్యారు. 18 మంది గైర్హాజరయ్యారు. ప్రైవేట్ కేంద్రంలో 16 మందికి గాను 12 మంది పరీక్ష రాశారు. నలుగురు గైర్హాజరయ్యారు. నర్వతో పాటు, మండలంలోని పెద్దకడ్మూరు, ఉట్కూరు మండలంలోని పులిమామిడిలోని జడ్పీహెచ్‌ఎస్, కస్తూర్బా, ఊట్కూర్ బాలుర, బాలికల ప్రభుత్వ జిల్లా పరిషత్ పాఠశాలల్లో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాలను డీఈవో గోవిందరాజులు పరిశీలించారు. పరీక్షా కేంద్రాల పరిధిలో 200 మీటర్ల వరకు ఐదుగురికి మించి గుంపులు ఎవరూ ఉండరాదని ఎస్పీ యోగేష్ గౌతమ్ సూచించారు.



గద్వాలలోని శారద విద్యానికేతన్ ఉన్నత పాఠశాలలోని పరీక్షా కేంద్రంలోకి వెళుతున్న విద్యార్థులు

- వనపర్తి జిల్లా వ్యాప్తంగా 36 పరీక్ష కేంద్రాల్లో పరీక్షకు 6,853 మందికి గాను, 6,840 మంది హాజరయ్యారు. 13 మంది గైర్హాజరైనట్లు జిల్లా విద్యాధికారి అబ్దుల్ ఘని ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని అన్ని సెంటర్లలో పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయన్నారు.
- జోగుళాంబ గద్వాల జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన పరీక్షలకు 99.59 మంది విద్యార్థులు హాజరైనట్లు ఇన్‌చార్జి డీఈవో అబ్దుల్ ఘనీ తెలిపారు. మొత్తం 7,600 మంది విద్యార్థులకు గాను 7,569 మంది హాజరయ్యారని, 31మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని చెప్పారు. జిల్లాలోని పలు పరీక్ష కేంద్రాలను రాష్ట్ర పరిశీలకుడు దుర్గాప్రసాద్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. జిల్లా అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసులుతో కలిసి గద్వాలలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల, విశ్వేశ్వరయ్య ఉన్నత పాఠశాల, మల్దకల్‌లోని జడ్పీహెచ్‌ఎస్, ప్రాథమిక పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాల, అయిజలోని శ్రీ కృష్ణవేణి, బ్రైట్‌స్టార్ ఉన్నత పాఠశాలల్లో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాలను ఆయన తనిఖీ చేశారు.



నాగర్‌కర్నూల్ జిల్లా, వెల్దండ పోలీసుస్టేషన్ నుంచి సెట్ కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న డీఈవో రమేష్‌కుమార్

- నాగర్‌కర్నూల్ జిల్లా వ్యాప్తంగా 60 పరీక్ష కేంద్రాల్లో 10,560 మంది విద్యార్థులకు గాను, 10,535 మంది పరీక్షకు హాజరు కాగా, 25 మంది గైర్హాజరయ్యారు. జిల్లా విద్యాధికారి రమేశ్‌కుమార్, పరీక్షల నిర్వహణ అధికారి రాజశేఖర్‌రావులు కల్వకుర్తి, వెల్దండ పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. అనంతరం ప్రాంతీయ విద్యా సంచాలకులు విజయలక్ష్మి హైదరాబాద్ నుంచి నిర్వహించిన సెట్ కాన్ఫరెన్స్‌లో వెల్దండ పోలీస్‌స్టేషన్ నుంచి డీఈవో పాల్గొన్నారు. జిల్లాలో పరీక్షల నిర్వాహణ తీరును ఆమెకు వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లా లోని మొత్తం 33 పరీక్ష కేంద్రాలను ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు తనిఖీ చేశాయి.

పాతకక్షలతో అన్నపై తమ్ముడి దాడి

వెల్దండ, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : పాత కక్షలతో అన్నపై తమ్ముడు దాడి చేశాడు. ఈ సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లా, వెల్దండ మండల పరిధిలోని కంటోనిపల్లి గ్రామంలో బుధవారం జరిగింది. ఎస్ఐ కురుమూర్తి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. తోట శ్రీరాములు అనే వ్యక్తి వనవాసం కార్యక్రమం కోసం పొలంలోని చెట్టు కింద శుభ్రం చేస్తుండగా, అతడి తమ్ముడు తోట జంగయ్య పాతకక్షలను మనసులో పెట్టుకుని అతడిపై కర్రతో దాడి చేశాడు. దీంతో శ్రీరాములుకు ఎడమచేయి, మూతిపై గాయాలయ్యాయి. ఈ మేరకు బాధితుడు ఫిర్యాదు చేయడంతో, జంగయ్యపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

అడవి జంతువు దాడిలో దూడ మృతి

వంగూరు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : పొలంలో కట్టేసి ఉన్న ఆవు దూడను అడవి జంతువు చంపేసింది. ఈ సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లా, వంగూరు మండలంలోని తిరుమలగిరిలో మంగళవారం అర్ధరాత్రి జరిగింది. గ్రామానికి చెందిన రైతు గోపాల్ మంగళవారం సాయంత్రం తన పొలంలో దూడతో సహా పశువులను కట్టేసి ఇంటికి వచ్చాడు. అర్ధరాత్రి సమయంలో అడవి జంతువు దాడి చేసి ఆవుదూడను చంపేసింది. ఈ ప్రాంతంలో చిరుతపులి సంచరిస్తున్నట్లు వదంతులు వ్యాపించాయి. దీంతో రైతులు పొలాలకు వెళ్లాలంటే జంకుతున్నారు.

జాతీయ స్థాయి క్రీడా పోటీలకు ఎంపిక

కల్వకుర్తి, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా, కల్వకుర్తి పట్టణంలోని మహాత్మాజ్యోతిబా పూలే గురుకులం విద్యార్థులు జాతీయ స్థాయి క్రీడా పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల 15, 16వ తేదీల్లో హనుమకొండలో జరిగిన సీనియర్ టెన్నికాయిట్ చాంపియన్ షిప్ పోటీల్లో అత్యంత ప్రతిభ కనబర్చి మమత, జాహ్నవి, శ్రీనిధి ఎంపికైనట్లు పీడీ సింధూజ తెలిపారు. ఒరిస్సా రాష్ట్రం, భువనేశ్వర్‌లో ఈ నెల 26 నుంచి 29వరకు నిర్వహించనున్న జాతీయ స్థాయి సీనియర్ టెన్నికాయిట్ చాంపియన్‌షిప్ పోటీల్లో వారు పాల్గొంటారని చెప్పారు. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థినులను ప్రిన్సిపాల్ డాక్టర్ నాగమణి, ఉపాధ్యాయులు అభినందించారు.



జాతీయ స్థాయి క్రీడలకు ఎంపికైన కల్వకుర్తిలోని ఎంజేపీ బాలికల విద్యార్థినులు

స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక సాయం

గద్వాల క్రైం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల చనిపోయిన తన స్నేహితుడి కుటుంబానికి వారు అండగా నిలిచారు. చేయి చేయి కలిపి రూ. 3 లక్షల ఆర్థిక సహాయం అందించారు. వారు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని సరస్వతి విద్యా మందిర్‌లో 1998లో దామోదర్‌రెడ్డితో పాటు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, రవికిషోర్, సందీప్, చైతన్య తదితరులు చదువుకున్నారు. ఆ తర్వాత కొందరు ప్రభుత్వ ఉద్యోగులు కాగా, మరికొందరు సాఫ్ట్‌వేర్ రంగంలో, కొందరు ప్రవేట్ ఉద్యోగులుగా పనిచేస్తున్నారు. దామోదర్‌రెడ్డి బతుకు తెరువు కోసం హైదరాబాద్‌లో క్యాబ్ డ్రైవర్‌గా పని చేస్తుండేవాడు. నెల రోజుల క్రితం ఆయన గుండెపోటుతో మృతి చెందాడు. దీంతో అతడి భార్య మౌనిక కూలి పని చేస్తూ ఇద్దరు పిల్లలను చదివించుకుంటోంది. విషయం తెలుసుకున్న మిత్రులు, ఆ కుటుంబాన్ని ఆదుకోవాలనుకున్నారు. ప్రస్తుతం అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్న ప్రవీణ్‌కుమార్‌రెడ్డి అక్కడున్న తన మిత్రులతో కలిసి రూ. 2 లక్షలు సేకరించారు. గద్వాలలో ఉన్న రవికిషోర్, సందీప్, చైతన్యలు మరో లక్ష రూపాయలు పోగు చేశారు. స్నేహితుడి భార్య, పిల్లలను బుధవారం గద్వాలకు పిలిపించారు. సేకరించిన రూ. 3 లక్షలను పోస్టాఫీస్‌లో పిల్లల పేరును ఫిక్స్‌డ్ చేయించి, వారికి బాండ్లను అందించారు. స్నేహితుడి భార్య మౌనికకు మరికొంత నగదును అందించారు. ఏ అవసరం వచ్చినా తాము అండగా ఉంటామని వారికి ధైర్యం చెప్పారు.



స్నేహితుడి భార్య మౌనికకు డిపాజిట్‌తో పాటు మరికొంత నగదును అందిస్తున్న స్నేహితులు

ఇంటర్వ్యూ..

చట్టం దృష్టిలో అందరూ సమానమే

- కృష్ణదేవ, ఎస్ఐ, ఊర్కొండ



ఊర్కొండ, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): చట్టం దృష్టిలో అందరూ సమానమేనని ఎస్ఐ కృష్ణదేవ్ అన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తప్పవని 'ఆంధ్రజ్యోతి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన అన్నారు.

ప్రమాదాల నివారణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

ప్రమాదాల నివారణలో భాగంగా ప్రధాన రోడ్ల కూడళ్లలో వాహనదారులకు అవగాహన కల్పిస్తున్నాం. అందులో భాగంగా మైనర్లు వాహనాలు నడిపితే తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తున్నాం.

డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన వారిని నాయకుల ప్రమేయంతో వదిలేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి?

అలా ఏమీలేదు. డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన వారికి చలానా విధించడంతో పాటు కోర్టులో హాజరు పరుస్తున్నాం.

మండల కేంద్రంలో ట్రాఫిక్ సమస్య ప్రజలకు ఇబ్బందిగా మారిందా?

కల్వకుర్తి-జడ్చర్ల ప్రధాన రహదారిపై ఊర్కొండ గేటు వద్ద ఇబ్బందిగా ఉన్నది వాస్తవమే. అడ్డదిడ్డంగా నిలుపుతున్న వాహనాలపై జరిమానాలు విధిస్తాం.

న్యూస్ బాక్స్

ఆలయ నిర్మాణ పనుల పరిశీలన

అచ్చంపేటటౌన్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో నూతనంగా నిర్మిస్తున్న పోచమ్మ ఆలయ నిర్మాణ పనులను మునిసిపల్ చైర్మన్ శ్రీనివాసులు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయ నిర్మాణ పనుల కోసం దాతల సహకారాలు అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు హరిచంద్ర, యాదయ్య, పాల్గొన్నారు.

తైబజార్‌కు వేలం

కల్వకుర్తి, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : కల్వకుర్తి మునిసిపల్‌లో తైబజార్‌కు బుధవారం వేలం నిర్వహించినట్లు కమిషనర్ మహమ్మద్ షేక్ తెలిపారు. మునిసిపల్ కార్యాలయంలో నిర్వహించిన వేలం పాటలో ఏడుగురు సభ్యులు పాల్గొన్నారని పేర్కొన్నారు. వీరిలో అత్యధికంగా 25లక్షల 3వేల రూపాయలకు శ్రీనివాస్ గౌడ్ దక్కించుకున్నారని ఆయన పేర్కొన్నారు. గత సంవత్సరం రూ.22లక్షల 610రూపాయలు ఉండగా ఈ సంవత్సరం 25లక్షల 3వేల రూపాయలు వేలం పాటలో దక్కించుకోవడం జరిగిందని ఆయన తెలిపారు.

పీఎం శ్రీ బృందం పరిశీలన

ఉప్పునుంతల, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : ఉప్పునుంతలలోని కేజీబీవీతో పాటు మండల పరిధిలోని వెల్టూరులోని మహాత్మా జ్యోతిబాపూలే బాలిక పాఠశాలను బుధవారం పీఎంశ్రీ బృందం సభ్యులు రవిశేఖర్, నర్సింహ, ఎంఈవో చంద్రశేఖర్ సందర్శించి పాఠశాలలోని మౌలిక వసతులు, భోజన గదులు తదితర వసతులతో పాటు విద్యార్థుల ప్రతిభను పాఠశాల ఎస్‌వో సైదాను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల రికార్డులను పరిశీలించారు. ఎస్‌వో సైదా, ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

నీటి నిర్వహణపై అవగాహన

కొల్లాపూర్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : పాలమూరు యూనివర్సిటీ కొల్లాపూర్ పీజీ సెంటర్‌లో బుధవారం ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో నీటి నిర్వహణ అనే అంశంపై ప్రిన్సిపాల్ డాక్టర్ మార్క్ పోలోనియస్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రస్తుతం వేసవికాలంలో నీటి నిర్వహణ పద్ధతులు, మానవ శరీరానికి నీటి ఉపయోగం, వర్షపు నీరును పొదుపు చేయాల్సిన పద్ధతులు, నీటి కాలుష్యం నిరోధక అనే పలు అంశాలపై పీజీ కళాశాల విద్యార్థులకు ప్రిన్సిపాల్ క్లుప్తంగా వివరించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ సంతోష్ కుమార్, బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

రేషన్‌కార్డు ప్రామాణికం పెట్టొద్దు : బీజేవైఎం

పెంట్లవెల్లి, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : రాజీవ్ యువ వికాసం పథకానికి రేషన్‌కార్డు ప్రామాణికం పెట్టవద్దని బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు మూలే భరత్‌చంద్ర అన్నారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ జయసింహకు వినతిపత్రం అందజేశారు. కొత్త రేషన్ కార్డులు మంజూరు చేయాలని, లేదంటే రేషన్ కార్డు ప్రామాణికం లేకుండా దరఖాస్తులు స్వీకరించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు ప్రసాద్, ఖలీల్, మూలి వెంకటేష్, కొత్తపేట కురుమూర్తి, బాలరాజు పాల్గొన్నారు.

రుణాల మంజూరుపై హర్షం

మన్ననూర్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : నిరుపేద ఆర్యవైశ్యులకు సబ్సిడీపై రుణాలు మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడం హర్షణీయమని రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ రీజినల్ చైర్మన్ జూలూరి సత్యనారాయణ, అవోపా రాష్ట్ర కార్యదర్శి సంబు వెంకట్‌రమణలు అన్నారు. అమ్రాబాద్ మండలం మన్ననూరులో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ రుణాలకు ప్రభుత్వం నిధులు కేటాయించడంతో, ఆర్యవైశ్యుల్లో చిరు వ్యాపారాలు, మధ్య తరగతి కుటుంబాలు చాలా ఉన్నాయని, వారి అభ్యున్నతికి రుణాలు ఇవ్వాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కాల్వ సుజాత విన్నపించడంతో స్పందించి సీఎం, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కలు రాయితీ రుణాలు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారని, వారికి కృతజ్ఞతలు తెలిపారు.

ప్రయాణం.. భయం భయం

- శిథిలావస్థకు చేరిన జటప్రోలు బ్రిడ్జి
- ఇనుప చువ్వలు తేలి ప్రమాదభరితంగా మారిన వైనం

శిథిలావస్థకు చేరిన జటప్రోలు బ్రిడ్జి





ఇనుప చువ్వలు తేలిన జటప్రోలు బ్రిడ్జి

పెంట్లవెల్లి, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జటప్రోలు గ్రామ సమీపంలో కృష్ణానదిపై ఉన్న బ్రిడ్జి శిథిలావస్థకు చేరింది. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రయాణికులు, వాహనదారులు భయపడుతున్నారు. 1984వ సంవత్సరంలో అప్పటి ఎమ్మెల్యే వెంకటేశ్వరరావు కృష్ణానదిపై రాకపోకల కోసం బ్రిడ్జి నిర్మాణం చేపట్టారు. బ్రిడ్జి నిర్మాణం చేపట్టి 41 సంవత్సరాలు కావడంతో శిథిలావస్థకే చేరి ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని వాహనదారులు నిత్యం భయాందోళనకు గురవుతున్నారు. ఆ బ్రిడ్జిపై ప్రతీ రోజు వందలాది వాహనాలు రాకపోకలు కొనసాగిస్తుంటాయి. కొల్లాపూర్ నుంచి పెబ్బేరు వెళ్లే ప్రధాన రహదారి కావడంతో పెద్ద పెద్ద లారీలు, ట్రక్కులు, ఆర్టీసీ బస్సులు నిత్యం రాకపోకలు సాగిస్తుంటాయి. బ్రిడ్జి శిథిలావస్థకు చేరి ఇనుప చువ్వలు తేలి ప్రమాదకరంగా మారింది. పెద్ద పెద్ద వాహనాలు రోడ్డుపై వెళ్తుంటే ఈ బ్రిడ్జి కదలికలు ఏర్పడుతున్నాయని జటప్రోలు గ్రామస్థులు వాపోతున్నారు. బ్రిడ్జి రోడ్డుపై సందులు ఏర్పడి ప్రమాదకరంగా మారింది. విషయాన్ని పలమార్లు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని గ్రామస్థులు, వాహనదారులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ చూపి బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని వారు కోరుతున్నారు.

నూతన బ్రిడ్జి నిర్మించాలి



జటప్రోలు బ్రిడ్జి 41 సంవత్సరాల క్రితం నిర్మించినది. శిథిలావస్థకు చేరింది. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని వాహనదారులు భయాందోళనకు గురవుతున్నారు. కొల్లాపూర్ నుంచి పెబ్బేరుకు ఇదే ప్రధాన రహదారి కావడంతో నిత్యం వందలాది వాహనాలు వచ్చిపోతుంటాయి. నూతన బ్రిడ్జి నిర్మించాలి.

- రఘు, సింగవరం

ఇనుప చువ్వలు తేలాయి



బ్రిడ్జిపై ఇనుప చువ్వలు తేలి ప్రమాదకరంగా మారింది. బ్రిడ్జిపై వాహనాలు వెళ్తుంటే కదలికలు ఏర్పడుతున్నాయి. బ్రిడ్జి మధ్యలో అక్కడక్కడా సందులు ఏర్పడినందున ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని భయాందోళనగా ఉంది. అధికారులు కొత్త బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలి

- అశోక్, వాహనదారుడు

బ్రిడ్జి నిర్మాణానికి పై అధికారులకు నివేదించాం

జటప్రోలు కృష్ణానది బ్యాక్ వాటర్‌పై నూతన బ్రిడ్జి నిర్మాణానికి గతంలో పై అధికారులకు నివేదించాం. ఈ మధ్య కాలంలో పై కప్పు ఇనుప చువ్వలు తేలడంతో మరమ్మతులు చేయించాం. నూతన బ్రిడ్జి నిర్మాణానికి అధికారుల దృష్టికి తీసుకుపోతాం. ఇంకా ఏమైనా మరమ్మతులు చేయాల్సి ఉంటే, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చేపడతాం.

- రమాదేవి, ఆర్అండ్‌బీ డీఈ

మైనార్టీల సంక్షేమానికి కట్టుబడిన ప్రభుత్వం

- ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి

కల్వకుర్తి, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : మత సామరస్యానికి ప్రతీకగా ఇఫ్తార్ విందులు దోహదపడుతాయని కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి తెలిపారు. పవిత్రమైన రంజాన్ మాసంలో ముస్లింలకు ప్రభుత్వం ఇఫ్తార్ విందు అధికారికంగా ఏర్పాటు చేస్తుందని పేర్కొన్నారు. కల్వకుర్తి పట్టణంలోని అబుబాకర్ ఫంక్షన్ హాల్‌లో బుధవారం ముస్లింలకు ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. ముస్లిం సోదరులతో కలిసి ఎమ్మెల్యే ప్రార్థనలు నిర్వహించారు. ముస్లిం, మైనార్టీల అభివృద్ధి, సంక్షేమానికి సీఎం ఎనుముల రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. అంతకుముందు రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని కల్వకుర్తి పట్టణంలోని పాత, కొత్తమస్జీద్‌ల వద్ద జరుగుతున్న ఏర్పాట్లను ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి స్థానిక నాయకులతో కలిసి బుధవారం పరిశీలించారు. కార్యక్రమంలో పొల్యూషన్ కంట్రోల్‌బోర్డు సభ్యుడు ఠాకూర్ బాలాజీసింగ్, కల్వకుర్తి మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్‌కుమార్, తహసీల్దార్ ఇబ్రహీం, కమిషనర్ మహమ్మద్ షేక్, మార్కెట్ చైర్మన్ మనీలా సంజుకుమార్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ రమాకాంత్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ షానవాజ్‌ఖాన్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి

● కల్వకుర్తి పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం కల్వకుర్తి, వెల్దండ మండలాలకు చెందిన 105 మందికి కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి పంపిణీ చేశారు.

పోషకాహారం కిట్ల పంపిణీ

కల్వకుర్తి పట్టణంలోని ప్ర భుత్వ ఆసుపత్రిలో క్షయ వ్యాధిగ్రస్తులకు పోషకాహార కిట్లను ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి పంపిణీ చేశారు. కార్యక్ర మంలో పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సభ్యుడు ఠాకూర్ బాలాజీసింగ్, డీఎంహెచ్‌వో స్వరాజ్యలక్ష్మి, డిప్యూటీ డీఎంహెచ్‌వో భీమానాయక్, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శివరాం, నాయకులు ఉన్నారు.

నమూనా ఇంటికి భూమిపూజ

వెల్దండ : ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన ఇందిరమ్మ నమూనా ఇంటి నిర్మాణానికి బుధవారం ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి భూమిపూజ చేశారు. నిరుపేద లబ్ధిదారులకు ఇచ్చిన మాట ప్రకారం ఇందిరమ్మ ఇంటిని అందిస్తామని ఆయన పేర్కొన్నారు. అనంతరం ఉద్యానవనశాఖ ఆధ్వర్యంలో సబ్సిడీపై మంజూరైన స్ప్రింక్లర్లను ఎమ్మెల్యే లబ్ధిదారులకు అందించారు. ఆధునిక పద్ధతిలో వ్యవసాయం చేస్తే సాగు విస్తీర్ణం పెరుగుతుందని పేర్కొన్నారు. వ్యవసాయానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తుందన్నారు. కార్యక్రమంలో పీసీబీ సభ్యుడు బాలాజీసింగ్, పీఏసీఎస్ డైరెక్టర్లు వెంకటయ్య గౌడ్, సంజీవ్‌కుమార్, మార్కెట్ డైరెక్టర్లు కేశమళ్ల కృష్ణ, రాజశేఖర్, తహసీల్దార్ కార్తీక్‌కుమార్, ఎంపీడీవో సత్యపాల్‌రెడ్డి, ఉద్యానవనశాఖ అధికారి మహేశ్వరి, నాయకులు భూపతిరెడ్డి, మోతీలాల్, పర్వత్‌రెడ్డి, పుల్లయ్య, రషీద్, ఎర్ర శ్రీను, నారాయణ, కార్యదర్శి గిరి ఉన్నారు.

ఐకేపీ వీవోఏలపై ప్రభుత్వ నిర్బంధం ఆపాలి

- ఐకేపీ వీవోఏల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాజ్‌కుమార్



రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న సీఐటీయూ నాయకులు, ఐకేపీ వీవోఏలు

నాగర్‌కర్నూల్ టౌన్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఉద్యమిస్తున్న ఐకేపీ వీఏవోలపై రాష్ట్ర ప్రభుత్వం ఉపయోగిస్తున్న నిర్బంధాలను ఆపాలని ఐకేపీ వీవోఏల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాజ్‌కుమార్ డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కేంద్రంలో సీఐటీయూ ఆధ్వర్యంలో ఐకేపీ వీఏవోలు రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు రాజ్‌కుమార్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సందర్భంగా ఐకేపీ వీఏవోల ఇచ్చిన హామీలను అమలు చేయాలని చలో హైదరాబాదుకు పిలుపునిస్తే ప్రభుత్వం వారిని ఎక్కడి కక్కడ పోలీసులతో నిర్బంధించిందని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి ఐకేపీ వీఏవోల కనీస వేతనం రూ.20 వేలు ఇచ్చి ఉద్యోగ భద్రత కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు వర్ధం పర్వతాలు, సహాయ కార్యదర్శి రామయ్య, ఐకేపీ వీఏవోల సంఘం నాయకులు వెంకటయ్య, మల్లేష్, సునీత, శశిరేఖ పాల్గొన్నారు.

దాతల సహాయంతో చదువులో రాణించాలి

- కరస్పాండెంట్ వి.రాజమహేందర్‌రెడ్డి

తెలకపల్లి, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతూ, మెరిట్ సాధించే నిరుపేద విద్యార్థులకు సిగ్మా మైక్రో సిస్టమ్ మేనేజింగ్ డైరెక్టర్, సీఎల్ఆర్ విద్యా సంస్థ అందిస్తున్న సహకారాన్ని సద్వినియోగం చేసుకొని విద్యలో రాణించాలని సీఎల్ఆర్ సంస్థ కరస్పాండెంట్ వి.రాజమహేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని కార్వంగ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని 8, 9, 10వ తరగతి మెరిట్ విద్యార్థులకు మూడు నెలలకు సంబంధించిన నగదు పురస్కారాలను అందజేశారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లోని మెరిట్ విద్యార్థులకు రూ.56,000నగదు పురస్కారాలను అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎం చల్మారెడ్డి, ఉపాధ్యాయులు రాంరెడ్డి, కురుమూర్తి, విజయ్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, పీడీ వెంకటేశ్వర్లు, సీఎల్ఆర్ విద్యా సంస్థ అధ్యాపకులు వి.భాస్కర్‌రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

గుడుంబా స్థావరాలపై ఎక్సైజ్ దాడులు

- 250 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం

దోమలపెంట, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : అమ్రాబాద్ మండలం వటువర్లపల్లిలో బుధవారం నాగర్‌కర్నూల్ డిస్ట్రిక్ టాస్క్ ఫోర్స్ (డీటీఎఫ్) సీఐ రాజ్యలక్ష్మి, అచ్చంపేట ఎక్సైజ్ ఎస్ఐ సతీష్ ఆధ్వర్యంలో ఆశాఖ సిబ్బందితో కలిసి దాడులు చేశారు. సీఐ మాట్లాడుతూ వటువర్లపల్లిలో 250లీటర్ల బెల్లం పానకం నిల్వలను ధ్వంసం చేశామని, బెల్లం, పానకం నిల్వలను గ్రామంలో ఇతరుల ఇళ్లలోఉంచడం వలన సారా కాసేవారు దొరకడం లేదని ఆయన పేర్కొన్నారు. బెల్ట్ షాపుల ద్వారా మద్యం అమ్మకాల చేపట్టినా, సారా కాసినా కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.



వటువర్లపల్లిలో బెల్లం పానకం ధ్వంసం చేస్తున్న ఎక్సైజ్ శాఖ అధికారులు

సారా స్థావరాలపై దాడులు

చారకొండ : మండంలోని చారకొండ, రాంపురం, గోకారం గ్రామాల్లో బుధవారం మహబూబ్‌నగర్ ఎన్‌ఫోర్స్‌మెంట్ టీం, కల్వకుర్తి ఎక్సైజ్ టీం అధికారులు స్థావరాలపై దాడులు చేసి 300 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేసి 10 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నట్లు కల్వకుర్తి ఎక్సైజ్‌శాఖ సీఐ వెంకట్‌రెడ్డి తెలిపారు. గోకారం గ్రామానికి చెందిన ఇద్దరి మహిళలపై కేసు నమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. మండలంలోని సిర్సనగండ్ల సీతారామచంద్ర స్వామి ఉత్సవాల సందర్భంగా సారా తయారు చేసినా, విక్రయించినా అలాంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకొంటామని హెచ్చరించారు. దాడుల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్ఐ కృష్ణ, సిబ్బంది నర్సింహ, రుక్యా, రఘు, నార్య, పరమేష్, భీమమ్మ ఉన్నారు.

సన్న బియ్యం సక్రమంగా పంపిణీ చేయాలి

వంగూరు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ఉగాది పండగ రోజు పంపిణీ చేయబోతున్న సన్న బియ్యాన్ని వినియోగదారులకు సక్రమంగా పంపిణీ చేయాలని డీటీ వెంకటరమణ డీలర్లకు సూచించారు. బుధవారం వంగూరులోని తహసీల్దార్ కార్యాలయంలో రేషన్ డీలర్లకు సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రేషన్ దుకాణాల్లో స్టాక్ ఆన్‌లైన్‌లో ఉన్న ప్రకారం ఉండేలా చూసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఆర్ఐ వసీం అక్రమ్, ఎంఆర్ఐ సుధ పాల్గొన్నారు.

స్టాక్‌ను సరిగా చూసుకోవాలి

ఉప్పునుంతల, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : రేషన్‌షాపులో స్టాక్ ఆన్‌లైన్ ఉన్న ప్రకారం సక్రమంగా ఉండేలా చూసుకోవాలని తహసీల్దార్ ప్రమీల అన్నారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో రేషన్ షాపు డీలర్లకు సమావేశం నిర్వహించారు. ఏప్రిల్ నెల నుంచి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న నూతన రేషన్ కార్డులు, సన్న బియ్యం పంపిణీ కార్యక్రమం విజయవంతంగా పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో డీటీ పరశు, గిర్దావర్ బాల్‌రాం, రేషన్ డీలర్లు ఉన్నారు.

అక్రమాలు జరిగితే సహించం

పెద్దకొత్తపల్లి, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : ప్రజా పంపిణీ వ్యవస్థలో ఎలాంటి అక్రమాలకు పాల్పడినా సహించేది లేదని పెద్దకొత్తపల్లి తహసీల్దార్ జేకే.మోహన్ రేషన్ డీలర్లను హెచ్చరించారు. బుధవారం మండల పరిధిలోని చౌకధర దుకాణాల డీలర్లతో స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ రమేష్, అదనపు గిర్దావర్ శివకృష్ణ పాల్గొన్నారు.

ఉపాధి హామీ కూలీలకు కనీస వసతులు కల్పించాలి

కోడేరు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న కూలీలకు కనీస వసతులు కల్పించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక జిల్లా ప్రధాన కార్యదర్శి పి.నరసింహ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం మండల పరిధిలోని నాగులపల్లి గ్రామంలో ఉపాధిహామీ కూలీల పని ప్రదేశాన్ని సందర్శించి వారితో సమస్యల గురించి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఎండల తీవ్రత ఎక్కువైన నేపథ్యంలో కూలీలకు పని ప్రదేశంలో కనీస వసతులైన తాగునీరు, టెంట్, మెడికల్ కిట్లు కల్పించాలని ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. ఉపాధి కూలీలకు 200 రోజులు పని కల్పించి రూ. 600 కూలీ డబ్బులు ఇవ్వాలని ఆయన అన్నారు. అలాగే కూలీల గడ్డపారలు, తట్టలు కూడా సరఫరా చేయాలని అన్నారు. మేట్లకు సెమీస్కిల్డ్ విధానాన్ని అమలు చేసి జాబ్ కార్డు పని దినాలతో నిమిత్తం లేకుండా మేట్లకు కనీస వేతనం ఇవ్వాలన్నారు ఈ కార్యక్రమంలో ఉపాధిహామి కూలీతో పాటు మేట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

పది పరీక్ష కేంద్రం తనిఖీ చేసిన డీఈవో



మోడల్ స్కూల్‌లో పదో తరగతి పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థులను పరిశీలిస్తున్న డీఈవో రమేష్‌కుమార్

వెల్దండ, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : పదవ తరగతి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా విద్యాశాఖాధికారి రమేష్‌కుమార్ సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని మోడల్‌స్కూల్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి పరీక్షా కేంద్రాలను డీఈవో తనిఖీ చేశారు. పరీక్ష సమయం కంటే ముందుగానే కేంద్రానికి చేరుకున్న రమేష్‌కుమార్ కేంద్రం వద్ద విద్యార్థులకు కల్పించాల్సిన వసతులను అడిగి తెలుసుకున్నారు. జిల్లాలోని 20 మండలాల్లో 60 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. గణిత పరీక్షకు 10,560 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకావాల్సి ఉండగా 25 మంది గైర్హాజరైనట్లు తెలిపారు.

పరీక్షల విధుల్లో ఉదాసీనత వద్దు

- ప్రాంతీయ విద్యాశాఖ సంచాలకులు విజయలక్ష్మి

పదవ తరగతి పరీక్షల విధుల్లో ఉదాసీనంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ప్రాంతీయ విద్యాశాఖ సంచాలకులు విజయలక్ష్మి హెచ్చరించారు. బుధవారం మండలకేంద్రంలో నిర్వహించిన సెట్ కాన్ఫరెన్స్‌లో డీఈవో రమేష్‌కుమార్‌తో కలిసి విజయలక్ష్మి మాట్లాడారు. పరీక్షలు పకడ్బందీగా నిర్వహించే బాధ్యత చీఫ్ సూపరింటెండెంట్‌లదేనన్నారు. ప్రతీతి విద్యార్థిని క్షుణ్ణంగా పరిశీలించాకే అనుమతించాలన్నారు. కార్యక్రమంలో పరీక్ష నిర్వహణ అధికారులు భోజేశ్వర్, శ్రవన్‌కుమార్, రవీందర్, రవికిరణ్ తదితరులు ఉన్నారు.

● కల్వకుర్తి : కల్వకుర్తిలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో కొనసాగుతున్న పదవ తరగతి పరీక్ష కేంద్రాన్ని డీఈవో రమేష్ కుమార్ బుధవారం తనిఖీ చేశారు. ఈ పరీక్ష కేంద్రంలో 130 మంది విద్యార్థులకు గాను ఒకరు గౌర్హారయ్యారని డీఈవో తెలిపారు.

క్షయ వ్యాధిగ్రస్తులకు పోషకాహార కిట్ల పంపిణీ

- డీఎంహెచ్‌వో డాక్టర్ కేవీ స్వరాజ్యలక్ష్మి



కొల్లాపూర్‌లో క్షయవ్యాధిగ్రస్తులకు పోషకాహార కిట్లు అందజేస్తున్న డీఎంహెచ్‌వో కేవీ స్వరాజ్యలక్ష్మి

కొల్లాపూర్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : పౌష్టికాహారంతో క్షయవ్యాధిగ్రస్తులు త్వరగా కోలుకుంటారని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కేవీ స్వరాజ్యలక్ష్మి వెల్లడించారు. బుధవారం పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి ఆవరణలో క్షయవ్యా ధిగ్రస్తులకు ఉచితంగా పోషకాహార కిట్లను ఇచ్చే కార్యక్రమాన్ని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధి కారి డాక్టర్ కేవీ స్వరాజ్యలక్ష్మి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... క్షయ వ్యాధిగ్రస్తులు ప్రతీ రోజు చికిత్సతో పాటుగా ఈ అదనపు పోషకాహార కిట్లను వినియోగిం చుకుని వ్యాధి నుంచి తొందరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. క్షయ వ్యాధిగ్రస్తుల బ్యాంకు ఖా తాలో ప్రతీనెల వెయ్యి రూపాయలు జమ చేస్తున్నామని తెలిపారు. ప్రతీ పోషకాహార కిట్టులో మూడు కిలోల గోధుమ పిండి, 1.5 కి లోల కందిపప్పు, 250 మిల్లీ లీటర్ల నూనె, ఒక కేజీ పల్లీలు ఉంటాయని తెలిపారు. అనంతరం కొల్లాపూర్ ప్రభుత్వ ఆసుపత్రిలోని ఎన్సీడీ క్లినిక్‌ను సందర్శించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటదాస్, కొల్లాపూర్ ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెం డెంట్ డాక్టర్ శ్రీనివాసులు, నాట్కో ఫార్మా కంపెనీ ప్రతినిధి డాక్టర్ మదన్మోహన్, ప్రోగ్రాం అధికారి డాక్టర్ రాజశేఖర్, వైద్యాధికారి డాక్టర్ రోహిత్, డీపీవో రేణయ్య, సబ్ యూనిట్ ఆఫీసర్ కిషోర్, సాయిరెడ్డి, రామ్మోహన్, ఎస్టీఎస్ ఆరిఫ్‌ఖాన్, ముక్తార్, రాజ్ కుమార్, ఇతర పర్యవేక్షణ సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, క్షయ వ్యాధిగ్రస్తులు పాల్గొన్నారు.

ఉద్యోగికి పదవీ విరమణ తప్పనిసరి



పెంట్లవెల్లిలో పదవీ విరమణ పొందిన ఆర్ఐ శివన్నగౌడ్‌ను సన్మానిస్తున్న ఆర్డీవో బన్సీలాల్

పెంట్లవెల్లి, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : ప్రతీ ఉద్యోగికి పదవీ విరమణ తప్పనిసరి అని ఆర్డీవో బన్సీలాల్ అన్నారు. బుధవారం పెం టట్లవెల్లి తహసీల్దార్ కా ర్యాలయంలో ఆర్ఐగా వి ధులు నిర్వహిస్తున్న శివన్నగౌడ్ పదవీ విరమణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సం దర్భంగా వారు మాట్లాడుతూ ప్రతీ ఉద్యోగి విధుల పట్ల అంకితభావంతో పని చేయాలని అన్నారు. అప్పుడే గుర్తింపు వస్తుందని అన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ జయసింహ, పెద్దకొత్తపల్లి డిప్యూటీ తహసీల్దార్ రమేష్‌నాయక్, కొల్లాపూర్ తహసీల్దార్ విష్ణువర్ధన్‌రావు, జూనియర్ అసిస్టెంట్ ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.

ఆలయాలను పరిశీలించిన స్థపతి వల్లినాయగం



ఉమామహేశ్వర ఆలయాన్ని పరిశీలిస్తున్న దేవాదాయ శాఖ అధికారులు

కోడేరు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని ఉమా మహేశ్వరస్వామి దేవస్థానాన్ని చెన్నకేశవ స్వామి దేవస్థానాలను రాష్ట్ర స్థపతి శ్రీ వల్లి నాయగం బుధవారం పరిశీలించారు. ఆయన వెంట దేవాదాయ శాఖ అధికారులు, ఆలయ కమిటీ సభ్యులు ఉన్నారు. ఉమామహేశ్వరస్వామి దేవస్థానాన్ని పరిశీలించిన ఆయన స్థలపురాణం బాగుందని, ఆలయంలో చిన్న చిన్న మార్పులతో ఆలయం అభివృద్ధి చెందుతుందన్నారు. అందుకు కావాల్సిన సూచనలను ఆలయ కమిటీ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డికి సూచించారు. గ్రామంలోని చెన్నకేశవస్వామి ఆలయాన్ని పరిశీలించిన ఆయన ఆలయాన్ని పునర్నిర్మించి గోపురాన్ని ఏర్పాటు చేయాలని కమిటీ సభ్యులకు సూచించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ గౌరవ అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, సభ్యులు వై.శివయ్యశెట్టి, మాధవచారి, శివారెడ్డి, వెంకట్‌రెడ్డి, ఎం.శ్రీనివాస్ రెడ్డి ఉన్నారు.

మేకల సంత వేలంలో రూ. 3.52 లక్షలు

చారకొండ, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో ప్రతీ శనివారం నిర్వహించే మేకలు, గొర్రెల సంతకు బుధవారం చారకొండ గ్రామపంచాయతీలో వేలం పాటను ఎంపీడీవో ఇసాక్‌హుసేన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వేలం పాటలో చారకొండ మండల కేంద్రానికి చెందిన చింతపల్లి సత్యంగౌడ్ రూ. 3.52 లక్షలకు వేలం దక్కించుకొనారు. కార్యక్రమం లో ఎంపీవో వెంకటేష్, పంచాయతీ కార్యదర్శి గణేష్ ఉన్నారు.

రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ఎన్నిక

కల్వకుర్తి, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : రైస్ మిల్లర్స్ అసోసియేషన్ డివిజన్ కమిటీ ఎన్నికైంది. అధ్యక్షునిగా బాలకృష్ణ ఎన్నికవగా జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జూలూరి రమేష్‌బాబు శాలువాతో సత్కరించా రు. కార్యక్రమంలో రైస్ మిల్లర్స్ అసోసియేషన్ సభ్యులు ఉన్నారు.

ఎయిర్ కూలర్ లేక పేలిన ట్రాన్స్‌ఫార్మర్

- అవస్థలు పడుతున్న రైతులు

కోడేరు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని నాగులపల్లి తండాలో ట్రాన్స్‌ఫార్మర్ పేలింది. ఎయిర్‌కూలర్ లేకపోవడంతో పేలిపోయిందని రైతులు రఘు నాయక్, బాలు నాయక్ తెలిపారు. బుధవారం ఉదయం నాగులపల్లి తండా మధ్య పొలంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ ఎయిర్ కూలర్ లేక కూలర్ పోగా నిప్పులు వచ్చి అకస్మాత్తుగా ట్రాన్స్‌ఫార్మర్ పేలిపోయిందని తెలిపారు. నాగులపల్లి, నాగులపల్లితండా మధ్యలో గల ట్రాన్స్‌ఫార్మర్ క్రాసింగ్‌లో ఉండ డంతో రోడ్డుపై వెళ్లే వాహనదారులకు పెద్ద పెద్ద వాహనాలకు కనిపించకపోవడంతో చాలా పర్యాయాలు ప్రమాదాలు జరిగాయి. ప్రమాదాల నివారణకు ట్రాన్స్‌ఫార్మర్‌ను వేరే చోట మార్చాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై లైన్‌మన్ ప్రభాకర్‌ను 'ఆంధ్రజ్యోతి' పలకరించగా ఆయన మాట్లాడుతూ ట్రాన్స్‌ఫార్మర్ బాడీ ఐరన్‌ది కావడంతో వేసవిలో వేడెక్కి, కాలిపోయిందని అన్నారు. అదనపు భారం పడి కూడా కాలిపోయి ఉంటుందని అన్నారు. త్వరలోనే రిప్లేస్‌మెంట్ ఇస్తామని ఆయన చెప్పారు.



పేలిన ట్రాన్స్‌ఫార్మర్